

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :20  సంచిక: 4 హైదరాబాద్    2020 ఆగస్టు  పేజీలు 40

**Please visit :  www.srimeherbaba.com**     వార్షిక సభ్యత్వం : రూ.100/-

సరికొత్తది

# బాబా ట్రస్టు యాప్




అవతార్ మెహెర్‌బాబా పిపిసి ట్రస్టు కోసం ప్రత్యేకంగా తానొక యాప్‌ను రూపొందించినట్లు శ్రీ దాట్ల రమణయ్యరాజు తెలిపారు. ఈ సరికొత్త యాప్‌ని మీ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవల్సిందిగా ఆయన కోరుతున్నారు. తద్వారా మెహెరాబాద్‌కి సంబంధించిన సమస్త సమాచారం మీ ముంజేతిలో వున్నట్లేనన్నాడాయన. మెహెర్‌బాబావారి సంక్షిప్త జీవితచరిత్ర, బాబా సమాధి, మెహెరాబాద్‌కి ఎలా చేరుకోవాలి? వసతి సౌకర్యం, వర్చ్యువల్ బాబా సమాధి దర్శనం, బాబా ప్రార్థనలు, **ట్రస్టు వారికి విరాళాలను ఆన్‌లైన్‌లో పంపుకునే సౌకర్యం,** మెహెరాబాద్‌లో జరుగబోయే కార్యక్రమాల వివరాలు ఇతరత్రా అన్నింటినీ ఓ పూలహారం మాదిరి ఒకేఒక్క యాప్‌లో ఏర్పాటుచేసినట్లు శ్రీ దాట్ల తెలిపారు.

## 60 సెకండ్లలో విరాళాలు

మనం సాధారణంగా పలు ప్రార్థనాలయాల్లో అడుగడుగున చూసేటువంటి హుండీలు మెహెర్‌బాబా సమాధి ప్రాంగణంలోగాని, మెహెరాబాద్‌లో ఎక్కడా కనిపించవు. ఫలానా చోట విరాళాలు సమర్పించాలనే సైన్‌బోర్డులు కూడా మెహెరాబాద్‌లో కనిపించవు. ఇది అవతారుని ఆదేశం. ట్రస్టు ఆఫీసులో మాత్రం విరాళాలు స్వీకరించి వెంటనే తగిన రశీదు అందజేస్తారు. ఐతే, ఇందుకోసం బాబా ప్రేమికలు సుమారు కిలో మీటరు నడవాల్సివస్తుంది. వయస్సులో పెద్దవారికి ఇది శ్రమతో కూడినది. ఈ నేపథ్యంలో శ్రీ దాట్ల రూపొందించిన యాప్ బహుధా ప్రశంశనీయం. ఈ యాప్ ద్వారా మనస్సులో ఆలోచన వచ్చిందే తడవుగా, కేవలం 60 సెకండ్లలో మెహెరాబాద్‌కి పంపదల్చుకున్న నగదును ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేయొచ్చు. తద్వారా, అవతారుని ట్రస్టుకి ఉడుతాభక్తిగా సహకరించినవారమౌతాం. ఆసక్తిగలవారందరూ ఈ యాప్‌ని తక్షణం డౌన్‌లోడ్ చేసుకోవల్సింది. మెహెరాబాద్‌కి విచ్చేసే ప్రేమికులకు తగిన సౌకర్యాల కల్పనలో అహరహం కృషిచేస్తున్న ట్రస్టువారికి సహాకరించుదాం!!

***

## బాబా సందేశం

**Selfless service and love are twin divine qualities.**

నిస్వార్ధ సేవ, ప్రేమ, ఈ రెండూ దైవీ గుణాలు.

– మెహెర్‌బాబా


గౌరవ సంపాదకులు
మల్లాది కృష్ణానంద్
99595-53218,
malladisukku@gmail.com

వ్యవస్థాపకులు:
దశిక ప్రసాదరావు


మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేదీ లోపల అందేలా పంపవలసింది.

## లోపలి పేజీలలో...


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | మెహెర్‌బాబాతో సరోష్ ఇరాని | 6-8 |
| 3. | అలనాటి మేటి పత్రికలు | 9-10 |
| 4. | గురువాజ్ఞ | 11-14 |
| 5. | మెహెర్‌బాబా ఎవరు? | 15-19 |
| 6. | లార్డ్ మెహెర్ | 20-27 |
| 7. | ఆంధ్రా పర్యటనలో | 28-29 |
| 8. | లక్ష్మీ హరీష్ కాంబ్లే | 30-33 |
| 9. | తెలుగు-గుజరాతీల సహవాస్ | 34-37 |
| 10. | బాబాలో ఐక్యమయ్యారు | 38 |
| 11. | పశ్చాత్తాప ప్రార్థన | 39 |



ఉత్తర ప్రత్యుత్తరాలకు
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

ఈ ప్రచురణలోని రచనలు, అందలి భావాలు సంబంధిత రచయితలవేనని పాఠకులు గమనించగలరు.

Please visit : www.srimeherbaba.com

# దైవీ మానవుడు
## సరికొత్త తెలుగు వీడియో

అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర, బాబావారి విశ్వ కార్యక్రమంకు సంబంధించిన అపూర్వమైన వీడియో **"దైవీమానవుడు"** పేరిట ఇటీవల హైదరాబాద్ బాబా కేంద్రం తెలుగులో రూపొందించి యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేసినట్లు శ్రీ ధీరం ఫణినాథ్ కోశి కేంద్రం చెప్పారు.

ఈ వీడియో నిడివి సుమారు 60 నిముషాలు. ఈ చిత్రాన్ని 2003లో అమెరికన్ దేశీయుడైన పీటర్ నాడీన్ **'GOD IN HUMAN FORM'** పేరిట అవతారుని జీవితచరిత్రలో గల అనేక ప్రధాన ఘట్టాలతో ఇంగ్లీషులో చిత్రీకరించారు. ఆ పిదప ఈ చిత్రం అనేక ప్రపంచ భాషల్లోకి డబ్బింగ్ చేసి ఆయా ప్రాంతాలలో ప్రదర్శించారు. అదేమాదిరిగా తెలుగువారి కోసం ప్రత్యేకంగా దైవీ మానవుడు శీర్షికతో తెలుగులో డబ్బింగ్ రికార్డుచేసినట్లు శ్రీ ఫణి చెప్పారు.
అవతారుని విశ్వకార్యక్రమాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించే సమగ్రమైన ఈ కొత్త వీడియోని బాబా ప్రేమికులందరూ తప్పక చూడాల్సింది.
తెలుగులో ఈ చిత్రానికి శ్రీమతి ధీరం రమ్య, శ్రీ బాలగోపాల మెహెర్ ఈశా డబ్బింగ్ చెప్పారు. వీలున్నవారందరూ తప్పక చూసే ప్రయత్నం చేయగలరు.
యూట్యూబ్ లింక్ ఇలా వున్నాయి.

http://www.avatarmeher.org/31-2/

The youtube link - https://www.youtube.com/watch?v=D_A1ZdSpbFs&t=12s

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామం అధిక పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక లేదా జీవిత సభ్యత్వం చెల్లింప జేయండి. మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలకు 99595-53218 సంప్రదించండి.

## సంపాదకీయం అక్షర సంపద

మెహెర్‌బాబా నామవ్యాప్తికై అనేక తెలుగు, ఇంగ్లీషు పత్రికలు ప్రధాన భూమిక పోషించాయి. 1920వ దశకంలో బాబా మెహెరాబాద్ ఆశ్రమాన్ని నెలకొల్పాక 1929 జనవరిలో తొలిసారిగా “ది మెహెర్ మెసేజ్” పేరిట ఇంగ్లీషులో మాసపత్రికను ప్రారంభించారు. ఆ పిదప, మెహెర్ గజెట్, మెహెర్‌బాబా జర్నల్ తదితర పత్రికలను స్థాపించారు. కాగా, అవతారుని నామవ్యాప్తికై కృషి చేసిన పలుపత్రికల గురించి సంక్షిప్త సమాచారం ఈ సంచికలోని 9-11 పుటలలో దయచేసి పరిశీలించండి!!. మెహెర్‌బాబా 1950వ దశకంలో రెండుసార్లు ఆంధ్రా ప్రాంతంలో పర్యటించారు. ఆ దరిమిలా తెలుగునాట కూడా అవతారుని నామవ్యాప్తికై స్థానిక బాబా ప్రేమికులు పలు వార, మాసపత్రికలను ప్రారంభించారు. ఈనాటి పత్రికలు రేపటికి వేస్ట్‌పేపర్ అన్నాడొక ఆంగ్ల కవి. ఐతే, బాబా పత్రికల విషయంలో ఇది నిజంకాదు. సుమారు ఓ శతాబ్దం క్రితం ప్రచురించిన నాటి బాబా పత్రికలను మెహెర్‌బాబా పాఠకులు నేటికీ ఎంతో బధ్రంగా దాచుకున్నారు. ఆనాటి పత్రికలలోని ప్రతి అంశం నేటికీ ఎంతో అమూల్యమైన ఆసక్తికర సమాచారాన్ని అందజేస్తున్నాయి. అవతారుని పత్రికలన్నీ ఓ అమూల్య అక్షర సంపదగానే పేర్కొనాలి. బాబా పత్రికలలోని అంశాలు ఎప్పుడు చదివినా పరిష్యుతమనిపించవు. ఆనాడు పత్రికలకు సంపాదకత్వం వహించిన వారందరూ గొప్ప పండితులు. వారు భాషా, సాహిత్య జ్ఞానం గల విషయజ్ఞులు. నాలాంటి వాళ్ళు వారి నుండి నేర్చుకోవల్సింది ఎంతో వుంది. గతంలేని వర్తమానం, వర్తమానం లేని భవిష్యత్తు ఊహించలేం!! ఆ కోణంలో ఆలోచిస్తే నాడు-నేడూ కూడా బాబా పత్రికలను స్థాపించిన వారందరూ గొప్ప ధనవంతులు కాదు. లాభార్జన కోసం బాబా పత్రికలను స్థాపించ లేదు. లాభ నష్టాలను ఎన్నడూ బేరీజు వేసుకోలేదు. పత్రికా నిర్వహణలో అనేక కష్టాలు ఎదురౌతాయని తెలియని అమాయకులు కాదు. ఆ కష్టాలన్నింటినీ ఆనందంగా ఎదుర్కొనేందుకు సిద్దమయ్యారు. పత్రిక స్వయం పోషకమైతేచాలనుకున్నారు. పలువురు సభ్యులుగా చేరి పత్రికను ప్రోత్సహిస్తే అదే పదివేలనుకున్నారు. ఆనాటితో పోల్చితే పత్రికల ప్రింటింగ్ విషయంలో ప్రచండమైన మార్పులు వచ్చాయి కానీ, పత్రికల ముద్రణ మాత్రం వేల సంఖ్యకు పెరగలేదు. వార్షిక సభ్యత్వం నామమాత్రంగానే వుంది. ఐనప్పటికీ పాఠకుల ఆదరణ అంతంతమాత్రమే. ఇది విచారకరం. పత్రికలు కనుమరుగుకావడానికి ఇదే ప్రధాన కారణం. పత్రికా నిర్వహణలో దోషాలు ఏమున్నా నిర్ద్వందంగా ఎత్తిచూపాలి. అవతారుని సందేశాలు, నామవ్యాప్తిని ఆశించే ప్రతిఒక్కరూ, ఒక్కొక్కరూ మరొక్కరినైనా పత్రికకు సభ్యునిగా చేర్పించాలి. కొద్దిమంది ప్రేమికులైనా ఈ దిశలో ఆలోచిస్తారని ఆశిద్దాం!!

***

# స్వగతం మెహెర్‌బాబాతో సరోష్ ఇరాని



1920వ దశకంలోనే మెహెర్‌బాబాను సాక్షాత్తూ భగవంతునిగా ఆరాధించి, అవతారునికి తన విశేష సేవలందజేసిన ధన్యుడు శ్రీ సరోష్ ఇరానీ. మెహెరాబాద్‌లో బాబావారి ఆశ్రమానికి సువిశాలమైన స్థలాన్ని అందజేసిన ఖైఖుస్రూ ఇరానీ సోదరి కుమారుడు శ్రీ సరోష్ ఇరానీ. ఈయన అహ్మద్‌నగర్ మేయర్‌గా స్థానిక ప్రజలకు అనేక సేవలందించారు. ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం వీరి సేవలకు గుర్తింపుగా "ఖాన్‌సాహెబ్" బిరుదుతో సత్కరించింది. అన్నింటికంటే మిన్నగా అవతారుడు ప్రత్యేకంగా ఎంచుకున్న ధన్యజీవి శ్రీ సరోష్. 1903 ఏప్రిల్ 22న అహ్మద్‌నగర్‌లో జన్మించారు. 1973 జనవరి 9న అవతారునిలో ఐక్యమయ్యారు. దిగవ మెహెరాబాద్‌లో వీరి సమాధి వుంది. సుమారు శతాబ్దం క్రితం అవతారుని దరి చేరిన సరోష్ ఈ తరం యువతకు ఆదర్శం.

**సరోష్ ఇరానీ తన గురించి స్వయంగా, క్లుప్తంగా చెప్పిన కొన్ని అంశాలను ఇకపై ఆయన మాటల్లోనే పరిశీలించండి.!!**

అది 1920వ సంవత్సరం. నేను పంచగనిలో పరీక్షలు పూర్తిచేసుకుని అహ్మద్‌నగర్‌కు తిరుగు ప్రయాణమయ్యాను. అహ్మద్‌నగర్‌లో మా తల్లితండ్రులున్నారు. నేను పంచగనిలో హాస్టలులో వుండి చదువుకుంటున్నాను. పంచగని నుండి అహ్మద్‌నగర్‌కు వెళ్ళాలంటే వయా పూణే నగరం మీదుగా వెళ్ళాలి. ఆ సమయంలో మా మేనత్త (గుల్మాయి) పూణేలో వుంది. నేను నగర్‌కి వెళ్ళేటప్పుడు పూణేలో ఆగి ఆమెని తీసుకురమ్మనమని మా ఇంటి నుండి ఉత్తరం వచ్చింది. పూణే నుండి అహ్మద్‌నగర్‌కు మద్రాసు మెయిల్‌లో బయల్దేరాలనుకున్నాం. మేం ఎక్కదల్చుకున్న రైలు పూణే నుండి అర్థరాత్రి బయల్దేరుతుంది. ఐనప్పటికీ ఇంటి నుండి కొద్దిగా ముందుగానే బయల్దేరదామని, స్టేషన్‌కు వెళ్ళే దారిలో తనకు ఓ చిన్న పని వుందని మా మేనత్త ముందుగానే చెప్పింది. దార్లో తానెవరినో కలవాల్సి వుందని చెప్పింది.

కాబట్టి స్టేషన్‌కు రెండు గంటలు ముందుగానే బయల్దేరాలనుకున్నాం.
ఆ మాదిరిగానే ఇంటి నుండి ఓ టాంగాలో బయల్దేరాం.
అలా వెడుతూ మార్గంలో ఫెర్గూసన్ కాలేజి దగ్గర ఆగాం.
అక్కడ మెహెర్‌బాబా ఓ జోపిడీలో వున్నారని చెప్పిందామె.
నన్ను టాంగాలోనే వుండమని చెప్పి, తాను ఒంటరిగా బాబావారిని చూడ్డానికి జోపిడీ దగ్గరకి వెళ్ళింది. నేను టాంగాలో నుంచే చూశాను. ఎవరో డోలక్‌పై వాయిస్తూ ఘజల్సు గానం చేస్తున్నారు. మధ్యలో మంట రగులుతోంది.
దాని చుట్టూతా కొందరెవరో వున్నారు. ఆ తర్వాత బాబా మాటల్లో మా మేనత్తని టాంగాలో ఇంకా ఎవరున్నారని అడిగారు.
మా మేనల్లుడున్నాడు. పంచగని నుండి వస్తున్నాడు.
అతను అలా ఉంటాడులే! పరవాలేదు అని ఆమె అంటే, లేదు,
ఆ తర్వాత్తర్వాత అతనితో నాకు చాలా పని వుంది.
అతడ్ని కూడా లోపలికి రమ్మనమని పిలవమన్నారు బాబా.
అలా నేను లోపలికి వెళ్ళాను. బాబాకు దగ్గరగా కూర్చున్నాను. బాబా నా తలపై, వీపుపై ప్రేమగా నిమిరారు. ఏం చేస్తున్నానని అడిగారు. భవిష్యత్తులో ఏమి కావాలనుకుంటున్నావ్ అని ప్రశ్నించారు. ముందు మెట్రిక్ పాసయ్యి, ఆ తర్వాత కాలేజీలో చేరతాను. ఆపై ఆ భగవంతుని నిర్ణయం ఎలా వుంటే అలా జరుగుతుందని జవాబిచ్చాను. బాబా అన్నారు కదా...
చదువు మానేసి తన దగ్గరకు వచ్చేయమన్నారు.
నిన్ను మహారాజుని చేస్తానన్నారు.
నా ప్రమేయం ఏమీ లేకుండానే ఆ పిదప ఆయన శిష్యుల్లో ఒకడినయ్యాను.
నేడు నేను నిజంగానే మహారాజుని అని సరోష్ అన్నారు.
ఆ మాదిరిగా 1920వ దశకంలోనే తాను బాబా దరి చేరానని చెప్పారు.
బాబా నాకు అనేక విధాలుగా సహాయపడ్డారు.
ఎన్నో చమత్కారాలు చేశారు. నన్ను ఆదుకున్నారు.
ఐతే బాబా ఎన్నడూ తాను చమత్కారాలు, మహత్యాలు చేయలేదని, మీరనుకునే ఆ మహత్యం కేవలం నా ఎడల మీకున్న నమ్మకం మాత్రమేనని కొట్టిపారేశేవారు. ఓ సందర్భంలో జరిగిన సంఘటన
నేను ఎన్నటికీ మరువలేనదంటూ ఆయన ఇలా అన్నారు.
ఆ రోజు బాబా ఎదుట మా అన్న గారు ఆదీ కె ఇరానీ ఇంగ్లీషు దిన పత్రిక టైంస్ ఆఫ్ ఇండియా చదివి వినిపిస్తున్నాడు. రెండవ ప్రపంచయుద్ధపు రోజులవి. జపాన్ కూడా ఈ యుద్ధంలో పాల్గొంటున్నప్పుడు మన దేశంలో ప్రతిచోటా భయానక

వాతావరణం నెలకొని వుంది. ఈ విషయమై బాబా తన చుట్టూతా వున్నవారందరితో
మాటామంతీగా చర్చిస్తూ ఇప్పుడు ఏమవ్వనుందని ప్రశ్నించారు. ఈ చర్చ తీవ్రంగా
రూపుదాల్చేసరికి, జపాన్ ఎక్కడో వుంది. మనం అహ్మద్‌నగర్‌లో వున్నాం.
మనకెంతో దూరంలో వున్న ఆ దేశం గురించి మనకేల భయం బాబా అన్నాను.
దాంతో బాబా, త్వరలోనే అహ్మద్‌నగర్‌లో బాంబు పడుతుంది.
అదీను, మీ ప్రాంగణంలోనే పడుతుందని హెచ్చరించారు. ఇదేదో ఓ జోక్ అనుకున్నాం.
మేం సీరియస్‌గా తీసుకోలేదు. ఆ పిదప, ఆ సంగతి మరచిపోయాం.
ఇలా ఐదారు నెలలు గడిచిపోయాయి. భారత స్వాతంత్ర్య సంగ్రామం కూడా
ముమ్మరంగా జరుగుతున్న రోజులవి. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా
జరుగుతోంది. అది 1942 డిశెంబరు 25. అహ్మద్‌నగర్‌లో బాబా సెంటర్,
మా సినిమాహాలు ఆఫీసు అన్నీ ఒకే విశాలమైన ప్రాంగణంలో వున్నాయి.
క్రిస్మస్ పండుగ రోజు రాత్రిపూట మా సినిమా హాలులో
ఓ ఇంగ్లీషు సినిమాను ప్రదర్శిస్తున్నాం.
ఆ సినిమా రెండవ ఆటకు ప్రత్యేకంగా 1200 మంది బ్రిటీషు సైనికులు,
230 మంది బ్రిటీషు సైనికాధికారులు సినిమా చూడ్డానికి వచ్చారు.
ఆ సినిమాకి ఇంటర్వెల్ సమయంలో మేమందరం బైటకు వచ్చాం.
ఆ సమయంలోనే సినిమా హాలు ప్రాంగణంలో ఓ పెద్ద బాంబు పేలింది.
దాంతో 12 మంది సైనికులు పైకి ఎగిరిపడి ప్రాణాలు వదిలిపెట్టారు.
మరి కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. కొందరికి కాళ్ళూ చేతులూ తెగిపడ్డాయి.
ఈ బాంబు ప్రేలుడు నాకు చాలా దగ్గరగానే జరిగింది.
నా బంధువు ఒకని తలకు పెద్ద గాయమయ్యింది.
అప్పుడు బాబావారి మాటలు గుర్తుకువచ్చాయి.
మా ప్రాంగణంలోనే బాంబు పడుతుందన్న బాబావారి హెచ్చరిక గుర్తుకు వచ్చింది.
ఐతే ఇది జపాన్ వారి బాంబు మాత్రం కాదు.
స్థానిక స్వాతంత్ర్యసమర యోధులు, బ్రిటీషు సైనికాధికారులపై
గురిపెట్టి విసిరిన చేతితో తయారుచేసిన బాంబు.
ఇలా బాబా మా వెన్నంటి వుండి మమ్మల్ని నడిపించారు.
అవతారుడు కరుణామయుడు. ఆయన నిత్యనామస్మరణవల్ల
అవతారుని కరుణ, కృప, రక్షణ మనకు సర్వకాల సర్వావస్థలయందు లభిస్తుంది.
ఇది మా గట్టి నమ్మకం.

**(అవేకనర్ సంపుటి 19, సంచిక 1లో సరోష్ ఇరానీ రాసిన వ్యాసం ఆధారంగా).**

# అలనాటి మేటి పత్రికలు

## (1950-70)

తెలుగునాట 1950వ దశకం నుండి పలు వార, మాస పత్రికలు అవతారుని నామ వ్యాప్తికి అంకితమై విశేష కృషి చేశాయి. అవతారుడు స్వయంగా ఆయా పత్రికల ప్రచురణకు ఆమోదం తెలిపారు. ఐతే, ఆ పత్రికలలో సింహభాగం నేడు కనుమరుగయ్యాయి. కాగా, ఈ తరం యువతలో ఆయా మాస పత్రికల పేర్లు కూడా వినని వారుండొచ్చు. వర్తమానం భవిష్యత్తుకు మార్గదర్శకం కదా!! పత్రిక పదివేల మందికి సమానం. అవతారుని సేవకు అంకితమైన ఆనాటి మేటి తెలుగు పత్రికల గురించి క్లుప్తంగా తెలుసుకునేలా మా అభ్యర్థన మేరకు ఆయా పత్రికల సమాచారాన్ని సేకరించి మెహెర్‌బాబా పాఠకుల కోసం ప్రత్యేకంగా శ్రీ అక్బర్ కృష్ణ (85006 48842) మాకు ఇటీవల పంపారు. ఆ వివరాలు ఇలా వున్నాయి. దయచేసి పరిశీలించగలరు.

| క్ర. సంఖ్య | పత్రిక పేరు ప్రారంభించిన సంవత్సరం | సంపాదకులు, ఇతర వివరాలు |
|---|---|---|
| 1) | **మెహెర్ సందేశ్** వార పత్రిక - 1953 | శ్రీ ఈదూరి నరసింహమూర్తి, విక్టరీ ప్రింటింగ్ ప్రెస్, పెనుగొండ, పశ్చిమ గోదావరి జిల్లా |
| 2) | **'వెలుగు'** వార పత్రిక - 1953 జూలై 10 మెహెర్ ప్రభుని ఆశీస్సులతో ప్రారంభించబడింది. | శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య, రాజమండ్రి. వీరు స్వాతంత్ర్య సమరయోధులు, ప్రియతమ బాబావారి దర్శన, స్పర్శన, ఆలింగనం, దివ్య ప్రసాదములను స్వీకరించిన ధన్యులు. తుది శ్వాస వరకు మెహెరుని సాహిత్యసేవలో తరించారు. బాబా ఆయనను నా ప్రియమైన వెలుగు (My dear velugoo) అని పిలిచేవారు. |
| 3) | **అవతార్ మెహెర్** 1955 ఫిబ్రవరి 25 | అవతార్ మెహెర్‌బాబా ఆంధ్రా కేంద్రం తరపున తొలిసారిగా శ్రీ కనకదండి సూర్యనారాయణ సంపాదకత్వంతో ప్రచురించారు. మెహెర్‌బాబా పాఠకుల విశేష ఆదరణ పొందిన ఈ పత్రిక గత 65 సంవత్సరాలుగా నిర్విఘ్నంగా ప్రతినెలా అనేక ఆసక్తికర శీర్షికలను ప్రచురిస్తోంది. |

| క్ర. సంఖ్య | పత్రిక పేరు ప్రారంభించిన సంవత్సరం | సంపాదకులు, ఇతర వివరాలు |
|---|---|---|
| 4) | **దివ్యవాణి** (Divine Voice) ఇంగ్లీషులో ప్రచురించిన ప్రపథమ మాసపత్రిక. 1961 జూలై 10 | శ్రీ స్వామీ సత్యప్రకాశ్ ఉదాసీన్, నిడదవోలు కేంద్ర స్థానంగా అవతారుని అనమతితో తొలిసారిగా తెలుగునాట ఇంగ్లీషు పత్రికను ప్రారంభించారు. బాబావారి సూచనల మేరకు దేశ, విదేశాలలోని వందలాది ప్రేమికులు ఎంతగానో ఆదరించారు. పత్రిక కేంద్ర స్థానాన్ని విజయవాడ, హైదరాబాదు, కాకినాడ, మండపేట ఇలా పత్రిక కేంద్ర స్థానాన్ని పలుమార్లు మార్చారు. పత్రికా సంపాదకులు శ్రీ స్వామీ సత్యప్రకాశ్ ఉదాసీన్, స్వాతంత్ర్య సమరంలో పాల్గొని, పిమ్మట సన్యసించారు. 1960 మే నెలలో అవతారుడ్ని దర్శించి బాబా వారి సేవకు అంకితమయ్యారు. |
| 5) | **దివ్యవాణి** తెలుగు వారపత్రిక 1975 నుండి మాసపత్రిక | స్వామీ సత్య ప్రకాశ్ ఉదాసీన్, వారి సంపాదకత్వంలో వారపత్రికగా ప్రారంభమై, 1975 నుండి మాసపత్రికగా ప్రచురించారు. 1980 తర్వాత పత్రిక ప్రచురణ నిలిచిపోయినట్లు సమాచార భోగట్టా. |
| 6) | **మెహెర్‌జ్యోతి** 1965 నుండి వారపత్రిక. ఆ పిదప 1970 నుండి మాసపత్రిక | స్వామీ సత్య ప్రకాశ్ ఉదాసీన్ వారి సంపాదకత్వంలో 1965 నుండి సచిత్ర వారపత్రికగా ప్రారంభమై, ఆ పిదప, 1970 నుండి మాసపత్రికగా శ్రీ నిట్ట భీమశంకరం గారి సంపాదకత్వంలో విజయవాడ నుండి శ్రీ ఎన్.వి. రమణయ్య గారి మెహెర్ ట్రేడర్స్ వారిచే ప్రచురించారు. |

మరికొన్ని పత్రికలు పూర్తిగా మెహెర్ ప్రభువుకి అంకితము కాకపోయినా, బాబావారి జీవిత విశేషాలు, సందేశాలు, బాబా కార్యక్రమ వివరాలు విరివిగా ప్రసారం చేసాయి. ముఖ్యంగా 1. "ప్రేమ జ్యోతి" వార పత్రిక, రాజమండ్రి సంపాదకులు శ్రీ పాలకోడేటి సూర్యప్రకాశరావు. 2."ధర్మజ్యోతి" మాసపత్రిక, రాజమండ్రి, సంపాదకులు శ్రీ కామరాజు హనుమంతరావు, 3. "ఆదిశక్తి" మాసపత్రిక, నిడదవోలు, సంపాదకులు శ్రీ ఇర్లపాటి వెంకన్న, 4. 'ప్రశాంతి' రాజమండ్రి, తదితర మాసపత్రికలు వున్నాయి.

# ఇంగ్లీషు పత్రికలు

**అవతారుని తెలుగు పత్రికలు** 1953 నుండి ప్రారంభమైతే, ఇంగ్లీషు మాసపత్రికలు 1929 జనవరి నుండే ప్రారంభమయ్యాయి. ఆనాటి ఇంగ్లీషు, హిందీ పత్రికలు వివరాలు ఇలా వున్నాయి.

| S.No. | Name of the Magazine | Editor |
|---|---|---|
| 1. | **THE MEHER MESSAGE**<br>Monthly. Ahmednagar, MS.<br>1st Issue: January 1929<br>Final issue: November 1931 | K.J.Dastur |
| 2. | **MEHER GAZETTE**<br>BIMONTHLY<br>June 1930 - Sept.1938 | V.T.Lakshmi &<br>C.V.Sampath Aiyangar |
| 3. | **MEHER BABA JOURNAL**<br>MONTHLY<br>Ahmednagar,MS.India<br>Nov.1938 - Oct.1942 | Elizabeth C.Patterson |
| 4. | **THE AWAKENER**<br>Biannual. July 1953- 1986<br>Seattle,WA,USA | Filis Frederick |
| 5. | **DIVYA VANI**<br>Quarterly, July 1961 - July 1975<br>also issued as ; Bimonthly, &<br>Monthly at times, on behalf of<br>the Meher Vihar Trust. | Swami Satya Prakash<br>Udaseen |
| 6. | **THE GLOW**<br>Quarterly<br>February 1966- 1976 | Frieny Nalavala -<br>Dehra Dun, |
| 7. | **GLOW INTERNATIONAL -**<br>Quarterly<br>August 1994 onwards | Naosherwan Anzar |
| 8. | **MEHER PUKAR**<br>1954 - 1963, Monthly<br>HINDI MAGAZINE | |

# గురువాజ్ఞ

**(మెహెర్ స్వాతి, బెంగళూరు)**

ఆ దంపతులకు గురువు గారి ఎడల ఎంతో ఆరాధ్యభావం వుంది.
ఆయన మాటను శివుని ఆజ్ఞలా భావిస్తారు.
గురువు గారికి కూడా వారంటే ఎంతో గౌరవం, ప్రేమ.
వీరి కుమార్తెను గురువు గారు తన సొంత కూమార్తెగా ప్రేమించేవారు.
గురువు గారు వారి వూరికి ఎప్పుడు వచ్చినా వీరు తప్పక కలిసేవారు.
ఆయన దర్శనం చేసుకుని, ఆయన ఆ వూర్లో వున్నంతసేపూ
అన్నీ తామై ఆయనకి సేవలందించేవారు.
ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి.
కాగా, వీరి కుమార్తెకు యుక్త వయస్సు వచ్చింది.
తల్లితండ్రులు ఆ అమ్మాయికి పెళ్ళి చేయాలనుకున్నారు.
ఈ విషయాన్నే గురువు గారి చెవిన వేశారు.
ఆయన “శుభం భూయాత్” అన్నారు. ఆ అమ్మాయిని అడిగితే కూడా
‘మీరేమి చెప్తే అది నాకు సమ్మతమేనని, గురువు గారికి ఆ అమ్మాయి చెప్పింది.
దాంతో తల్లితండ్రులు యోగ్యుడైన యువకుడ్ని వెదికి తెచ్చారు.
గురువు గారు కూడా ఆతను తగిన వరుడని ఆమోదించారు.
ఆ పిదప, వివాహం ఘనంగా జరిగింది. అంతా సక్రమంగా జరిగి,
అందరూ ఆనందంగా ఉన్నారు. పెళ్ళికి వచ్చిన చుట్టాలందరూ వెళ్ళిపోయారు.
ఆ పిదప, గురువు గారు వరుడితో కొద్దిసేపు ఏకాంతంగా మాట్లాతానన్నారు.
ఇందుకు ఆ దంపతులు ఎంతగానో సంతోషించారు.
ఆ వరుడితో ఏకాంతంగా మాట్లాడ్డానికి,
అతడ్ని దూరంగా తీసుకెళ్ళాడు గురువు గారు.
గురువు గారు ఆతనితో ఏం మాట్లాడారో తెలియదు గానీ,
వరుడి ముఖంలో రంగులు మారాయి. అతనికి కోపం కట్టలు త్రెంచుకుంది.
నీవెక్కడి గురువువని గట్టిగా దూషించాడు.
ఇలాంటి మాటలు మరోమారు తనకు చెప్పొద్దని గురువు గారిని హెచ్చరించాడు.
ఆపై తన అత్తమామలపై రుసురుసలాడుతూ, తన భార్యను తీసుకుని వెళ్ళిపోయాడు.
ఆ దంపతులకు ఏం జరిగిందో తెలియదు. అందరూ అవాక్కయ్యారు.
అందరూ కళ్ళలో నీళ్ళు నింపుకుని నిస్సహాయంగా, మౌనంగా చూస్తూ నిల్చున్నారు.

ఆపై ఆ అమ్మాయి గురువు గారి దర్శనానికై మరలా రాలేదు.
అలా అనేకంటే, ఆమె భర్త గురువు గారి ఊసే ఎత్తడానికి వీల్లేదని శాసించాడు.
ఐతే, ఆ దంపతులు మాత్రం గురువు గారిని ఎప్పటిలా ఆరాధిస్తున్నారు.
ఆయన తమ వూరికి ఎప్పుడు వచ్చినా, ఆయనకి తమ సేవలు అందజేస్తున్నారు.
గురువు తమకి మంచి చేస్తారనే నమ్మకం వారికుంది.
కాలచక్ర భ్రమణంలో ఆ అమ్మాయికి ఆడపిల్ల పుట్టింది.
పెరిగి పెద్దదయ్యింది. పెళ్ళీడుకు వచ్చింది.
ఐతే ఆమె పెళ్ళి చేసుకునేందుకు సుతరామూ ఒప్పుకోదు.
ఆమె మార్గం భిన్నమై పోయింది. ఇది వారందరినీ కలచివేస్తుంది.
పరిష్కారమార్గం లేక ఎంతో బాధపడుతుంటారు.
గురువు గారికి ఇదంతా తెలుసు. ఐనా తెలియనట్లే వుంటాడు.
ఒకసారి గురువు గారిని దర్శించుకునే సమయంలో
తమ కుమార్తె, మనుమరాలి ప్రస్తావన చేశారు. ఆయన ఏమీ తెలియనట్లు,
ఇప్పుడు మీ మనుమరాలి వయస్సు ఎంత? పెళ్ళయ్యిందా? వారెలా వున్నారు?
ఇలా యోగక్షేమాలు అడిగాడాయన.
ఆ భార్యాభర్తలు ఇద్దరూ ఏమీ మాట్లాలేదు. మౌనంగా తలవంచుకుని వుండిపోయారు.
కొద్దిసేపయ్యాక గురువు గారే తిరిగి ఆమెకు పెళ్ళి చేశారా? ఎలాగున్నారని ప్రశ్నించారు.
దీనికి ఆ దంపతులు ఇద్దరూ ఆమెకు పెళ్ళి చేసే అవకాశం లేదు.
ఆ అదృష్టం మాకు దక్కడం లేదని కన్నీరు పెట్టుకున్నారు.
"ఆమె వేశ్యగా మారింది. ఆమెని ఎవరు పెళ్ళి చేసుకుంటారని,
మనస్సుని రాయిలా చేసుకుని, ఉన్నదివున్నట్లు అంతా"
గురువు గారికి చెప్పారు ఆ దంపతులు.
ఆ పిల్ల తల్లితండ్రులు కూడా తలెత్తుకోలేక బాధలో వున్నారని చెప్పారు.
గురువు గారు వారిని ఓదారుస్తూ, తాను వారిద్దరితో మాట్లాడతానన్నాడు.
వారిని పిలిపించమన్నారు.
మా అల్లునికి మీ పేరు ఉచ్ఛరించడం కూడా ఇష్టం వుండదు.
మీకు ఈ విషయం తెలుసు కదా స్వామి!! అని ఆ దంపతులు అన్నారు.
మా అల్లుడు మీ దగ్గరకు రాడు. మా అమ్మాయిని ఆతను రానీయడన్నారు.
"మీరు వారిని నా వద్దకు పిలిపించండి. వారు వస్తారు. నేను చెప్తున్నాను కదా" అని
ఆదేశించాడు గురువు గారు. ఆపై వారు తమ కుమార్తెకు కబురు పంపారు.
వారి అల్లుడిలో గతంలో వున్నంత కోపం అణిగిపోయింది.

గురువు గారు పిలుస్తున్నారని తెలియగానే, వెంటనే ఆయన దర్శనానికి అంగీకరించాడు.
ఆ పిదప వారు తన దగ్గరకి వచ్చినప్పుడు గురువుగారు ఎంతో ప్రేమగా పలకరించాడు.
ఆప్యాయతగా దగ్గరకు తీసుకున్నాడు.
గురువు గారు చూపిస్తున్న ప్రేమకు వారు ముగ్ధులయ్యారు.
కన్నీటి పర్యంతమయ్యారు. వారిద్దరూ గురువు గారికి తమ బాధ చెప్పుకున్నారు.
ఆ సమయంలో గురువు గారు వారి అల్లుడితో
"మీ పెళ్ళి అయ్యాక తాను ఒంటరిగా కలిసినప్పుడు ఏం చెప్పానో
ఇప్పుడు దాన్ని అందరికీ వినపడేలా గట్టిగా చెప్పమన్నారు.
ఆ రోజు జరిగిన విషయాన్నే ప్రస్తావిస్తూ అతగాడు ఇలా చెప్పాడు.
"పెళ్ళి తంతు అంతా పూర్తయ్యాక,
తన తొలి రాత్రిని ఓ వేశ్యతో గడపమని గురువు ఆదేశించారని అన్నాడు.
అందుకు అవసరమైన డబ్బులు కూడా గురువు గారు ఇస్తానన్నారు.
మొదట్లో ఆయన మాటలు వేళాకోళమనుకున్నాను.
కానీ, గురువు గారు సీరియస్ గానే చెప్తున్నారని తెలిశాక,
ఆయనపై నాకు పట్టరాని కోపం వచ్చింది.
ఆపై ఏం జరిగిందో అందరికీ తెలిసిందే అని ఆతడు జవాబిచ్చాడు.
"ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు.
నీ మొదటి సంతానానికి అలా రాసిపెట్టి ఉంది.
అందుకే ముందుగా నిన్ను ఒక వేశ్యతో ఆ రాత్రి గడపమన్నాను.
అలా చేసి ఉంటే, మీ మొదటి సంతానం వేశ్యకే పుట్టేది.
అక్కడే వేశ్యలా వుండేది. మీకు ఈ నరక బాధ అనుభవించాల్సి వచ్చేది కాదు.
మీపట్ల నాకున్న ప్రేమతో నేను అలా సలహా ఇచ్చానన్నారు గురువు.
గురువు చేసే పని విధానాలు, ఆయన పద్ధతులు అందరికీ అర్థంకావు.
గురువు ఏం చెప్పినా, చేసినా అంతా మీ మంచికే అని గుర్తించాలి.
నా మాట ఆచరించి ఉంటే నేడు ఈ బాధ వుండేదికాదని, గురువు వారిని ఓదార్చారు.
ఏరుచ్ ఇంకా ఇలా చెప్పారు. బాబా ప్రేమికులలో ఒకరికి ఇదే మాదిరిగా జరిగింది.
అదేమిటో వివరంగా చెబుతూ ఏరుచ్ ఇలా అన్నారు.
బాబా ప్రేమికులలో ఒకరి కుమారుడికి తీవ్ర అనారోగ్యం చేసింది.
ఎంత వైద్యం చేసినా ఆ పిల్లవాని ఆరోగ్యం కుదుటపడలేదు.
ఈ విషయాన్ని బాబా దృష్టికి తీసుకొచ్చారు.
బాబా అంతా విని, ఆ పిల్లవాడిని ఏ ఆసుపత్రికి తీసుకెళ్ళొద్దు.
మీకు తెలిసిన డాక్టర్‌ని ఇంటికి పిలిపించుకుని, ఆతనికి చెప్పి

తగిన చికిత్స ఇప్పించండన్నారు. వారు బాబా చెప్పినట్లే చేశారు.
ఐతే, ఆ పిల్లవాడి ఆరోగ్యం ఏ మాత్రం మెరుగుపడలేదు.
ఇరుగు పొరుగు వాళ్ళు పిల్లవాని బాధను చూసి, దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్ళమని సలహా ఇచ్చారు. పిల్లవాని తల్లితండ్రులు తిరిగి బాబా వద్దకు వచ్చి జరిగిన సంగతి చెప్పారు. అందుకు బాబా ప్రస్తుతం ఇస్తున్న చికిత్సనే కొనసాగించమన్నారు.
ఆసుపత్రికి తీసుకువెళ్ళాల్సిన పన్లేదన్నారు.
ఐతే, ఆ పిల్లవాని ఆరోగ్యం క్రమేణా క్షీణిస్తుంది.
దాంతో ఆ చుట్టుప్రక్కల వున్నవారు కలగచేసుకొని
"నిక్షేపంగా వున్న పిల్లాడిని నిలువునా చంపేస్తారా? అంటూ
బలవంతంగా తీసుకెళ్ళి దగ్గర్లో వున్న ఆసుపత్రిలో చేర్పించారు.
అక్కడ డాక్టర్‌లు ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత అతని ఆరోగ్యం మెరుగవుతుంది.
అందరూ ఆనందిస్తారు. ఆ పిల్లవాడు పెరిగి పెద్దవాడయ్యాడు.
ఐతే, అతగాడు చెడు స్నేహాలకు అలవాటుపట్టాడు. ఆతని ప్రవర్తన శృతి మించుతుంది.
ఆతని చేష్టలుతో తల్లితండ్రులు తలెత్తుకోలేకపోతారు. చివరాఖరుకు
పిల్లవానితో విసుగెత్తిపోతారు. చిన్నతనంలో వచ్చిన ఆ మహమ్మారి రోగంతో
వాడు కన్నుమూసినా బాగుండేదని అనుకుంటారు.
ఇదే మాటల్ని వారు బాబా దర్శనార్థం వెళ్ళినప్పుడు ఆయన ఎదుట బాధగా చెప్తారు.
దాంతో బాబా "తానేమో సహాయం చేయబోతే, మీరు మీ స్నేహితుల
మాటల్ని ఆలకించారని, బాబా వారికి గుర్తుచేశారు. బాబాని తమ తప్పుని క్షమించమని
వేడుకున్నా, అప్పటికే జరగాల్సింది జరిగిపోయిందని ఏరుచ్ చెప్పడం ముగించారు.
అవతారుడు తన ప్రేమికులను అన్ని వేళలా ఆదుకుంటాడు.
ఐతే అందుకు వారూ సిద్ధంగా వుండాలని, ఏరుచ్ హితవు చెప్పారు.

***

# శ్రీకాకుళం కేంద్ర 59వ వార్షికోత్సవం

శ్రీకాకుళం కేంద్ర 59వ వార్షికోత్సవం సందర్భంగా 2020 ఆగస్టు 23న ప్రత్యేక ఆన్‌లైన్ సహవాస్ కార్యక్రమం ఉదయం 9 నుండి మ. 2 గంటల వరకూ నిర్వహించామని స్థానిక కేంద్ర అధ్యక్షులు శ్రీ గుడ్ల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ అరవిన్ మెహెర్ యూట్యూబ్ చానల్ ద్వారా ఈ సహవాస్ ఏర్పాటు చేశామని ఆయన అన్నారు.

# మెహెర్‌బాబా ఎవరు?

## ప్రశ్న - జవాబులు



అంతర్జాతీయ పర్యాటక సంబరాల సందర్భంగా అవతార్ మెహెర్‌బాబా ముంబాయి సెంటర్ వారు 1967 అక్టోబరు 30న **WHO IS MEHER BABA?** అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. మెహెర్‌బాబాకు సంబంధించి ఆసక్తికర విషయాలెన్నింటినో ప్రశ్న - జవాబుల రూపంలో ఈ పుస్తకంలో ఇంగ్లీషులో ప్రచురించారు. కాగా, మా అభ్యర్థన మేరకు, డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు మెహెర్‌బాబా పాఠకుల కోసం సరళమైన తెలుగులో అనువదించి పంపారు. డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు, హైదరాబాద్ ఆకాశవాణి, దూరదర్శన్‌లలో వివిధ హోదాలలో బాధ్యతలు నిర్వర్తించి, అడిషనల్ డైరక్టర్ జనరల్, ఢిల్లీ దూరదర్శన్ నుండి 2005 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేశారు. పద్యంపై మక్కువతో ఆయన 150పైగా అవధానాలు చేశారు. కవిగా, నవలా రచయిత, వ్యాసకర్త, అనువాదకునిగా ఆయన ప్రసిద్ధులు. వీరి రచనలకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పలు అవార్డులు ఇచ్చి సత్కరించాయి. మెహెర్‌బాబా ప్రేమికులందరికీ ఎంతగానో ఉపయోగపడనున్న ఈ శీర్షికలో మొత్తం 39 ప్రశ్నలకు గాను, ఈ సంచికలో 14 ప్రశ్నలకు జవాబులు ప్రచురిస్తున్నాం. మిగిలినవాటిని 2020 సెప్టెంబరులో సంచికలో కొనసాగించనున్నాం. దయచేసి పరిశీలించగలరు.

1. **మెహెర్‌బాబా ఎవరు?**

**సమా:** ఆ ప్రశ్నను మీరు అడగటానికి ప్రేరేపించిన మీ ఉనికికి సారాంశం.
- అజ్ఞాన నిద్రలో వున్న మానవత్వాన్ని మేలుకొలిపి ఆత్మ జ్ఞానతత్వం వైపు నడిపే శక్తి
- సత్ప్రవర్తనతో కూడిన దివ్య వారసత్వ జ్ఞానాన్ని మానవునిలో మేలుకొలిపే ప్రేరకుడు.
- స్వార్ధమనే అంధకారాన్ని తొలగించి భగవంతునిలో మనఏకత్వాన్ని స్ఫురింపజేసే కాంతి
- సత్యమార్గంలో మానవజాతిని నడిపించడానికి విచ్చేసిన నిజమైన స్నేహితుడు.
- మానవ రూపంలో వున్న భగవంతుడు. - రక్షకుడు, యేసయ్య, క్రీస్తు, రసూలు,
-అవతారపురుషుడు, బుద్ధుడు, - అన్ని ప్రశ్నలకు సమాధానం.
- ఆయన అవతార పురుషుడు. దైవాంశ సంభూతుడు.

**2. ఆయనను అవతారంగా ఎందుకు పిలుస్తారు?**

**సమా:** ఆయన అవతారం కాదు. ఆయనే అవతారం. భిన్న కాలాలలో, భిన్న రూపాలలో, భిన్న నామాలతో అవతరించే ఒకే ఒక్క దేవుడు. ఆయన అవతారం కాబట్టి

మెహెర్‌బాబాను అవతారమంటారు. ఆయనను మరో విధంగా పిలవలేము. మానవాకారంలో వున్న దైవాంశ గల దైవం ఆయన. సామాన్య మానవునికీ, దైవీ మానవునికీ తేడా ఇదే. సాధారణ మానవుడు తనలో నిగూఢంగా వున్న దైవత్వాన్ని గూర్చి పూర్తి అవగాహన కలిగి వుండడు. దైవీ మానవుడు దైవత్వాన్ని, మానవత్వాన్ని రెండింటినీ ఎరుక కలిగి వుంటాడు. అపరిమిత జ్ఞానాన్నీ, అపరిమిత శక్తినీ,అపరిమితానందాన్ని– ఆయన నిరంతరం అనుభూతి పొందుతాడు. తన సృష్టిలోని ప్రతి ఒక్కరిలో, ప్రతి ఒక్కరితో **ఒకేసారి** బాధ ననుభవిస్తాడు. దైవీ మానవుడిగా భగవంతుడు యుగయుగాలుగా వ్యక్తిగతంగాను, విశ్వజనీనంగాను మానవాళికి సహకరిస్తాడు. తన బిడ్డలపై గల మమకారంతో మధ్యమధ్యలో మానవరూపంలో ఆయన కనిపిస్తాడు. భగవంతుడొక్కడే కావున, అవతారాలు ఒకటి కంటే ఎక్కువ వుండవు. అవతారం ఒక్కటే. దైవీ మానవుడొక్కడే.
ఏ సమయంలోను రెండు అవతారాలుండవు. మానవుల మధ్యలో భగవంతుడు సంచరించినపుడు అతనిని అవతారమని పిలుస్తారు. అవతారాలుగా పిలవబడే మిగిలినవి నామమాత్రాలేగాని, వాస్తవం కాదు.

**3. ఆయన అవతారమని మీరు ఎందుకు విశ్వసిస్తున్నారు?**

**సమా:** విశ్వాసము లేదా నమ్మకమనేది ఆంతరద్యోతకము, ప్రగాఢ నమ్మకము. దానిని మాటల రూపంలో వ్యక్తపరచలేం. అది స్వీయానుభవం కావాలి. ఆయనలో భగవంతుని లక్షణాలు, ఉనికి యొక్క అస్థిత్వము మాకు కన్పిస్తున్నాయి గాబట్టి మెహెర్‌బాబా అవతారమని మా నమ్మకం. మెహెర్‌బాబా అవతారమని అనుభూతిని పొందిన అదృష్టవంతులు వందలు, వేల సంఖ్యలో ఉన్నారు.

**4. మెహెర్‌బాబా మౌనం ఎందుకు పాటిస్తారు?**

**సమా:** "ఆత్మ లోపల లోతుగా వినిపించే స్వరం నాది. ఈ స్వరాన్ని అందులో గల వారి ద్వారా నేను శాశ్వతంగా మాట్లాడుతాను. నేను బహిర్గతంగా మౌనం వహించడం ఆధ్యాత్మిక ప్రక్రియ కాదు. ఇతరుల మంచి కోసం నేను దానిని అవలంబిస్తున్నాను. నేను మౌనానికి బద్ధుడను. నేను దానిని ఉల్లంఘించినపుడు అసలైన స్వాతంత్రం ఏమిటో మానవాళి గ్రహిస్తుంది" అని మెహెర్‌బాబా మానవాళి శ్రేయస్సు కోసం పలికారు.

**5. ఆయన మౌనాన్ని ఎప్పుడు విరమిస్తారు?**

**సమా:** రెండు వర్గాలు ఒకసారి మాట్లాడ లేవు. ఒకరు మాట్లాడితే మరొకరు వినాలి. ఆయన దివ్యవచనం వినడానికి ప్రపంచం సిద్ధంగా వున్నపుడు మెహెర్‌బాబా

తన మౌనం విరమిస్తారు. మెహెర్‌బాబా అంటారు "మీరు మౌనం ఎప్పుడు విరమిస్తారని నన్ను ప్రజలు అడిగారు. బదులుగా నేను వారి నడిగాను నా మౌనం మాట్లాడకపోతే, నా నాలుకతో పలికిన ప్రసంగాల వల్ల ప్రయోజనం ఏముంది?

**6. ఆయన ఎలా విషయ వివరణ చేస్తారు?**

**సమా:** తన ముందుకు వచ్చిన వారికందరికీ తన దివ్య ప్రేమ ద్వారా వారి హృదయాలను స్పృశిస్తాడు. దివ్యము, స్వచ్ఛమైన ప్రేమ ద్వారా హృదయ భాష ద్వారా, వాచక భాషకంటె శక్తివంతమైన మౌనహృదయ భాష ద్వారా మాట్లాడుతారు. మాట్లాడిన పదాలకంటె మరింతగా వ్యక్తీకరించగల హస్త కదలికల ద్వారా.

**7. ఏళ్ళతరబడి మౌనం తర్వాత ఆయన మాట్లాడగలరా?**
(అది అసాధ్యమని వైద్యులంటారు)

**సమా:** అవును. ఆయనది మానవ మౌనం కాదు గాబట్టి, ఆయన మాట్లాడ గలుగుతారు.

**8. మౌన విరమణను ఆయన ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్నారు?**

**సమా:** అనంతమైన దయవల్ల, రోగి కోలుకోవడానికి చాలాకాలం పడుతుందని తెలిసినా, త్వరలో కోలుకొంటారని డాక్టరు చెబుతాడు. రోగిని సందర్శించిన అన్ని సందర్భాలలోను డాక్టరు – త్వరలో నెమ్మదించి కోలుకొంటారనీ, మరోవారంలో– ఇంకో వారంలో మీరు ఆసుపత్రి నుండి విడుదల అవుతారనీ, చివరగా ఆరోగ్యం కుదుటబడేంతవరకు ఆశ్వాసన చెబుతుంటాడు. అదేవిధంగా దైవీమానవుడు దైవాంశ వైద్యుడు లేదా యెస్సయ్య– ఈ రోగగ్రస్థ మానవాళిని నయం చేయడానికి వచ్చాడు. భగవత్ సృష్టిలోని కారణాన్ని తెలుసుకునే అజ్ఞానం నుండి ఆయన మౌన విరమణ మానవాళికి విడుదల కలిగిస్తుంది.

**9. ఎక్కువ సమయం మెహెర్‌బాబా ఏకాంతంగా ఎందుకుంటారు?**

**సమా:** ఆయన అవతార సమయం ఆసన్నమైనందున ఆయన అవిభాజ్య శ్రద్ధను వ్యక్తపరచే విశ్వజనీన కృషి వృద్ధి పొందసాగింది. తన ప్రేమికులు సహనంగా వుండాలనీ, తన ఉనికిని గుర్తించాలనీ తన ఏకాంతం నుండి బయటపడి దర్శనమిస్తారు.

**10. ఏకాంతంలో వున్నపుడు వాస్తవానికి ఆయన ఏం చేస్తుంటాడు?**

**సమా:** జ్ఞానాంతర్గత స్థాయిలలో, మనకు తెలియని విషయాలలో ఆయన విశ్వజనీన కృషి సలుపుతాడు. ఒక్కొక్కసారి ఏ విధమైన ఉత్తర ప్రత్యుత్తరాలు, ఏకాంతానికి భంగం కలిగించని సందర్శకులు వుండాలని ఆయన ప్రత్యేకించి కోరుకొంటారు. "ప్రతిఒక్కరూ ఏదో ఒకటి చేస్తుంటారు. నేను మాత్రం ఏమీ చేయను." అని కూడా అంటారాయన.

**11. మెహెర్‌బాబా మతమేది?**

సమా: ఆయన ఏ మతానికీ చెందినవాడు కాదు. అన్ని మతాలు ఆయనవే. ఆయన అంటారు– "ప్రాచీన శాశ్వతంగా నేనుండటమే నా వ్యక్తిగత మతం. అన్ని మతాలకు సత్యమైన దైవ ప్రేమను నేను మతంగా బోధిస్తాను.

**12. ఆయన బోధనలేవి?**

సమా: భగవంతుని స్మరించు, భగవంతుని ప్రేమించు. నిన్ను, సమస్తాన్నీ మరచిపో! ఆయన బోధించడు. కాని, భగవంతునిపై ప్రేమను ఉత్తేజపరుస్తాడు.

**13. ఆయన కార్యకలాపాలేమి?**

సమా: బాధాగ్రస్థులకు, పేదలకు ఆయన సహకరిస్తాడు. తనతో నివసించే వారికి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తారు. ఏకాంతంలో లేనపుడు ఆయన ప్రజలకు దర్శనమిస్తారు. ఏకాంతంలో లేనపుడు దూరప్రాంతాల నుండి భిన్న దేశాలనుండి వచ్చి తనతో వుండిపోవాలనుకొన్న ప్రేమికులకు ఆయన ఇంటర్వ్యూలిస్తారు. ప్రపంచవ్యాప్తంగా వున్న తన అనుయాయులు, భారతదేశంలోను, విదేశాలలోను ఆయన సందేశమైన ప్రేమ, సత్యాన్ని ప్రచారం చేసే వందలాది మెహెర్ కేంద్రాల నుండి మన ఉత్తరాలలో అధికభాగానికి వ్యక్తిగత శ్రద్ధతో సమాధానాలిస్తారు.

ఆయన ఏకాంతంలో వున్నపుడు అటువంటి విషయాలపట్ల శ్రద్ధవహించరు. విశ్వజనీన కృషి చేయాలనే ఉద్దేశంతో ఏకాగ్రతకు భంగం కలగకుండా వుండాలని అలా కోరుకొంటారు. అంతరాత్మ స్థాయిలన్నింటిలో ఆయన విశ్వజనీన కృషి కొనసాగిస్తున్నా, కొన్ని ప్రత్యేక సమయాలలో విశ్వజనీన కృషి అత్యంత ఉన్నతస్థాయికి చేరినపుడు ఆయన పూర్తి ఏకాంతానికి వెళ్ళిపోతారు. ఒక్కొక్కసారి ఆయన ఏకాంతంలో వున్నపుడు ఆయన కుష్ఠి వ్యాధిగ్రస్తుల పాదాలు కడుగుతారు. వికారమైన పంజారాలలోని అందమైన ఆత్మలుగా వారిని ఆయన పేర్కొంటారు. బాధపడేవారు ఆయనకు సన్నిహితులు. వారి కోసం నిరంతరం ఆయన బాధపడతారు.

**14. ఆయన ప్రత్యేక ప్రార్థనలను లేదా ధ్యానం చేస్తారా?**

సమా: మానవజాతికి ఆయన రెండు ప్రార్థనలిచ్చారు. (1) గురువు యొక్క ప్రార్థన. (ఓ పర్వర్దిగార్), (2) పశ్చాత్తాప ప్రార్థన. ఏవిధమైన ధ్యానం గూర్చి ఆయన ప్రత్యేకించి చెప్పలేదు. మన దైనందిన విధులకు మనం హాజరవుతూ ఆయనను నిరంతరం మన: పూర్తిగా జ్ఞప్తికి తెచ్చుకోమని నొక్కి చెబుతారు. అదే ఉత్తమమైన ధ్యానమని ఆయన చెబుతారు. అయితే, ధ్యానాన్ని గూర్చి కొన్ని ప్రవచనాలు, "దివ్య ఇతివృత్తం" అనే రెండు పటాలు అందించారు.

**–సశేషం..ముగింపు వచ్చే సంచికలో**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,**

**వాల్యూం-3 (1925 నుండి -**

***తెలుగుసేత:** మల్లాది రామారావ్, న్యూఢిల్లీ*

***(గత సంచిక తరువాయి)***

కిట్టీ బాబావారి గదిలోకి అడుగుపెట్టింది.
ఎదురుగా కూర్చోమన్నారు ప్రభువు.
తటపటాయించింది కాసేపు. ఇంతటి మహద్భాగ్యం మళ్ళీ వస్తుందా
అనుకొందో ఏమో, ప్రభువు ఆజ్ఞని పాటించింది.
మెహెరుని కేసి చూస్తూ కూర్చొంది.
అలనాటి ఏసు ప్రభువు ఇలనాటి మెహెరు ప్రభువు అన్న నమ్మకం పెరిగింది.
ఇంతలోనే వో ధర్మ సందేహం బుర్రని తినివేసింది.
దేవ దేవుడు సంపన్నుడా, నిరుపేదా, ఇదీ ఆమెకి వచ్చిన చిక్కు ప్రశ్న.
అనంత సంపన్నుడు భగవంతుండు అంటారు.
అలానే అగణిత సంపదలకి పెట్టింది పేరు అని కూడా అంటారు.
మరి అలా అయితే, పేదరికం భగవంతుడి కనుచూపు మేరలో వుండకూడదు.
కానీ ఇది ఏమిటి? మెహెర్‌బాబావారు చిరిగిన సాద్రా వేసుకొన్నారు అనుకొంది.
ఈ ప్రశ్న ఎందుకు వచ్చిందీ అంటే,
బాబావారి సాద్రా చిరుగు ఆమె కంట పడింది కాబట్టి.
ఆ చిరుగు కాస్తా కుడితే? భేషుగ్గా వుంటుంది. కానీ కుట్టడం ఏలాగ?
ప్రభువుని అడగాలి? ఆయన అనుమతించాలి. ఇవన్నీ అయ్యే పనులేనా,
ఇదొక కొత్త ధర్మసందేహం. సాద్రా చిరుగు కుట్టాలన్న తపన వో ప్రక్కా,
ప్రభువుని అడగడమెలా అన్న భయం మరో ప్రక్కా, పాపం కిట్టీకి ఏమీ పాలు పోలేదు.
ప్రభువుకి భక్తురాలి మనస్సు తెలియక పోతే కదా!
ఎందుకమ్మా, అంతగా కొట్టుకుపోతావు అని అంటున్నట్లు,
కుట్టిపెట్టవా కిట్టీ! నా సాద్రా కాస్తంత చిరిగింది, అన్నాడు మెహెరుడు.
కిట్టీ మనస్సు తేలికపడింది. హుషారు వచ్చింది. సూదీ, దారం తీసుకువస్తానంది.
శుభం అన్నాడు మెహెరుడు. నన్ను సేవించే అవకాశం అందరికీ దొరకదు.
నీకు ప్రసాదించాను. అదృష్టవంతురాలివమ్మ నువ్వు అన్నాడు.

పొంగిపోయింది కిట్టీ. దొరుకునా యిటువంటి సేవ అని మురిసిపోయింది.
నన్ను సేవించి తరించే అవకాశాలు యింకా దొరుకుతాయిలే అని
అవతారుడు అంటుంటే, ఏమి! నా అదృష్టం, ఎన్ని జన్మల పుణ్యఫలం అనుకొన్నది
ఆ బ్రిటీషు వనిత. ఆమె ధన్యురాలు నిజంగా. మనసులో కోరిక మనస్సులో
వుండగానే తీరింది. అందుకనే ప్రియతముడు అయ్యాడు మెహెరుడు,
కిట్టీకే కాదు, అందరికీ. అయినా ముల్లోకాల ఏలిక చిరిగిన బట్టలువేసుకోవటమా!
ఆ చిరుగు కుటించుకోవడమూ విడ్డూరంగా లేదు! ఇది మాకు, నాకు
వచ్చే ధర్మసందేహం! కోరికలు లేని వాడు, కోర్కెలకి అతీతమైనవాడు భగవంతుడు.
భోగభాగ్యాలు అంటవు పేదరికం బాధించదు పరాత్పరుడిని.
అవసరాలూ లేని పరంధాముడు, ఇదిగో నా సాద్రా చిరిగింది.
కుట్టి పెట్టవా, అని అడిగాడు ఇలనాటి కుచేలుడి కధని గుర్తుకు తెస్తుంది.
పిడికెడు అటుకులు ఆనాడు, చిన్న చిరుగు ఈనాడు భక్తుల కోరిక తీర్చాయి.
ముక్తి మార్గంలో పడవేశాయి. సాద్రా చిరుగుని కిట్టీ కుడుతుంటే,
మెహెరీశుడు ప్రేమగా చూశాడు ఆమెకేసి.
ఈ వరం చాలు ప్రభూ, ఈ జన్మకి! అనుకొంది కిట్టీ.
ఆ రోజు రాత్రి కిట్టీకి నిద్ర పడితే వొట్టు. తన గదిలో బాబావారు ఉన్నారని,
మార్గరెట్ క్రాస్కీ వున్న గదికి మారింది. ఆమె మంచం ప్రక్కన పరుపు వేసుకొని
నడుం వాల్చింది. "కనులు తెరిచినా నీవే, కనులు మూసినా నీవే", అన్నట్లు
మెహెరుని దివ్య మంగళ రూపం కన్పిస్తోంది. మార్గరెట్‌కి చెప్పాలనుకొంది,
తన అనుభూతిని. వెంటనే లేచి కూర్చున్నది.
మార్గరెట్‌ని పిలిలింది. మంచి నిద్రలో వుందేమో, ఆమె బదులు పలకలేదు.
చేయి పట్టి కుదిపింది. అయినా చలనం రాలేదు ఆమెలో.
ఏమిటీ పాడు మొద్దు నిద్ర అనుకొంటూ, గట్టిగా వూపింది.
ఏమయింది, కిట్టీ? అంటూ కళ్ళు తెరిచింది క్రాస్కీ.
"ఏమయింది అంటావేమిటి? ఎదురుగా బాబా కన్పిస్తుంటే,
ఎంత అందంగా వెలిగి పోతోందో బాబా వారి మొహం! చూడు, అంది కిట్టీ.
"అలాగా" అంటూ నిద్రలోకి పోయింది నేస్తం.
తెల్లవారాక క్రాస్కీ అడిగింది. ఏమయింది రాత్రి నీకు"
"ఏమో! నాకేమి తెలుసు", అని బదులు పలికింది, కిట్టీ.
సరే, మళ్ళీ మనం, మెహెరీశంలోకి వస్తే ఆవేళ,
అదే బాబావారు లండన్ వచ్చిన మొదటి రోజున,
ప్రభువును కలవడానికి చాలా మంది వచ్చారు.

కిట్టీ అక్క, మార్తమే క్లూస్ బాబావారిని దర్శించింది.
మాగీ బార్టన్, హొరేస్ ఫ్లెమింగ్ అనే వారిద్దరు బాబాని కలిశారు.
జపాన్‌కి చెందిన కోయిజుమి వచ్చాడు. ఇతగాడు మార్షల్ ఆర్ట్స్‌లో నిష్ణాతుడు.
"జుజిట్సు" అన్న యుద్ధ కళలో నిపుణుడు. 17వ శతాబ్ది నుంచి ప్రచారంలో
వుందట ఈ విద్య. చేతిలో ఆయుధం వున్నా, లేకపోయినా సరే,
ప్రత్యర్థిని క్షణాల్లో పడగొట్టడం, జుజిట్స్యు నిపుణుల ప్రత్యేకత.
వారి ఈ విజయ రహస్యం మనకి తెలియదు. ఆ కిటుకు చెబితే కదా ఎవరైనా!
ఇంతకీ బాబావారి దగ్గరకి కోయిజుమి తన కళా ప్రదర్శనకి రాలేదు.
బాబావారు ఇంగ్లాండ్‌లో వున్నన్ని రోజులు శాఖాహారం వండటానికి వచ్చాడు.
అంటే మన కొత్త నలుడు ఈ జపనీయుడు.
తానే వంటా – వార్పు చేస్తాడో, ఎవరయినా వండుతుంటే,
మెళుకువలు మాత్రమే చెప్తాడో తెలియదు. ఈ వైనం ముమ్ముందు తెలియవచ్చు.
శాఖాహారం తయారీలో సాయపడతాడని మాత్రం చరిత్రకారుడి అభిప్రాయం.
ఈవాళ వచ్చిన వారందర్నీ విడివిడిగా కలిశారు బాబా.
వాళ్ళ గోడు విన్నారు. ఎవరికి తగ్గ సలహా సూచనలు వారికి చేశారు.
ఈ దర్శన కార్యక్రమం తర్వాత, బాబావారు మెరిడిత్‌ని కలిశారు.
హెర్బర్ట్, కిట్టీ, మార్గరెట్ ప్రభృతులు మెరిడిత్ వెంట వచ్చి
బాబా వారి సమక్షంలో కూర్చొన్నారు.
పాల్ రాబ్‌సన్ పాటలు వింటూ అనేక విషయాలు మాట్లాడారు.
మెహెరుడు జగద్గురువు. ఆయన సమక్షంలో ఎలా వుండాలి?
ఈ మెళుకువనే చెప్పాడు మెరిడ్త్.  మితభాష్యం మంచిదన్నాడు.
సద్గురువు ఎదురుగా కూర్చొన్నప్పుడు, మనం ఆయన మాటల్ని వినాలి.
మన మాటల్ని ఆయన కాదు అన్నాడు. మీరు ఎంత తక్కువ మాట్లాడితే
అంతమంచిది అన్నాడు. దృష్టి గురువుపై పెట్టి, శ్రద్ధగా వినాలి అని చెప్పాడు.
సరేనన్నారు మిత్రులు. పాపం వాళ్ళకి ఏమి తెలుసు,
బాబావారి సన్నిధిలో నిర్మొహమాటంగా వుండాలి. అందుకనే బాబా వారు ఆప్యాయంగా
పలుకరిస్తున్నా, వీరందరూ, ఆ, వూ, అనటం తల ఆడించడం తప్ప
నోరు విప్పితే వొట్టు. ఇది మెరిడిత్ మహత్యం. ఇతగాడికి ధ్యానం మహా గురి కదా!
అందుకని ధ్యానం చేయండి అని అందరికీ చెప్పాడు. ఏకాగ్రత అవసరం అన్నాడు.
ఏకాగ్రత ఎలా సాధించవచ్చో చెప్పాడు. మనస్సు చంచలమైనది దాన్ని కట్టి పడేయండి.
ఏదో వొక విషయంపై దృష్టి పెడితే, ఏకాగ్రత వస్తుంది ఈ ఏకాగ్రత వల్ల ధ్యానం
వీలవుతుంది అంటూ ధ్యానోపదేశం చేశాడు మెరిడిత్.

హెర్బర్ట్ ప్రభువులకి అద్భుతహో అనిపించింది. ప్రపంచ పరిస్థితుల గురించి
మెహెరీశుడు ప్రస్తావించారు. రెండవ ప్రపంచ యుద్ధం తప్పదు అన్నారు.
ఏడు నెలల తర్వాత యుద్ధ భేరీలు మోగుతాయన్నారు.
హెర్బర్ట్‌ని తమతో రమ్మన్నారు. తమ ఆదేశాల మేరకి చైనాలో పని చేయాలన్నారు.
అతగాడి కోరిక కూడా అదే కదా! నా అభిమతం గురువు గారికి తెలిసిందనుకొన్నాడు.
అక్కయ్య కూతురు జిల్లా బాబాని కలుస్తానంది "మామయ్య! ఈ కొత్తాయన,
అదే మీరు అందరూ కలుస్తున్న భారతీయుడిని నేనూ చూస్తాను.
నన్ను తీసుకువెళ్ళవా ఆయన దగ్గరకి, అన్నది. హెర్బర్ట్ సందిగ్ధంలో పడ్డాడు.
జిల్లా చిన్నపిల్ల. పట్టుమని పదిహేను ఏళ్ళు నిండలేదు.
ఇప్పటి నుంచీ గురువుల వెంట పడటమా!!
దేనికయినా సమయం రావాలి అనుకొన్నాడు.
ఏది ఏమయినా బాబా వారినే అడుగుదామను కొన్నాడు.
మర్నాడు ఉదయం అల్పాహారం సమయంలో అడిగాడు.
బాబా! నా మేనకోడల్ని తీసుకురానా నీ దర్శనానికి అని.
ప్రభువు తీసుకు రమ్మన్నాడు.
బాబా వారప్పటికే జిల్లాని పలకరించారన్న సంగతి అతగాడికి తెలీదు.
బాబా వారు చెప్పలేదు. ఇంతకీ ఏమయిందీ అంటే, తెలతెలవారుతుంటే,
బాబావారు జిల్లా పడుకొన్న గదికి వెళ్ళారు. ఆ పాపాయి మంచి నిద్రలో వుంది.
ఆమెకి నిద్రా భంగం కల్గించరాదనుకొన్నారు. బాబా నుదుట ముద్దాడటానికి
వొంగుతుంటే, ఆ చిన్నారి కళ్ళు తెరిచింది. బాబావారి కేసి తదేకంగా చూసింది.
బాబావారు చిరునవ్వు నవ్వారు. జిల్లా మోహం విచ్చుకొంది.
మెహెరుని ప్రేమతో నిండిపోయింది మనస్సు.
భగవంతుడు, ఏకాగ్రత, ధ్యానం అంటే ఏమీ తెలియని ఆ చిన్నారి పాపకి
పరాత్పరుడే స్వయంగా దివ్యోపదేశం చేశాడు దగ్గరకి వచ్చి.
'మౌనమే నీ భాష వో మూగ మనసా'! అన్న కవివాక్కు సార్థకమైంది మరోతూరి
అదీ మౌనావతారకాలంలో. జిల్లా నిద్రలోకి జారుకొంది మళ్ళీ.
తలుపు దగ్గరగా వేశాడు మెహెరుడు. బయటకి నడిచారు.
కిట్టీ కనిపించింది. నీ అక్క కూతురు అదృష్టవంతురాలన్నారామెతో.
జిల్లా గతం, నా కళ్ళముందు కన్పిస్తోంది. ఆమె భవిష్యత్ కూడా కన్పిస్తోంది అన్నారు.
వివరాలు చెప్పలేదు. కానీ జిల్లాకి ఉజ్వల భవిష్యత్ వుందని చెప్పకనే చెప్పారు.
అవతారుని సేవలో తరిస్తుందన్న సంకేతమూ యిచ్చారు.
జిల్లా నా కోసం చాలా పని చేయాలి" అన్నారు.

తూర్పు చల్లా కోంబ్‌కి తీసుకురా నీతో, మంగళవారం, అన్నారు.
కిట్టీ తలాడించింది. మీ ఆజ్ఞ ప్రకారం చేస్తానంది.
జిల్లా మా అందరికంటే అదృష్టవంతురాలని మురిసిపోయింది.
ఆ వేళ బాబావారు మెరిడిత్‌స్టార్‌కి వో పని పురమాయించారు.
"నువ్వు చాలా పని చేయాలోయ్ అన్నారు.
"అంతకంటేనా ప్రభు" అన్నాడతగాడు.
ఏం చేయాలో మెహెరుడు వివరించారు.
డావన్‌షైర్ రిట్రీట్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాలు మరిన్ని కావాలి.
అమెరికా, టర్కీ, రష్యా, పరిష్యా, ఇంగ్లాడ్‌లలో ఈ కేంద్రాలు తెరవాలన్నారు.
కొంబె మార్టిట్ కేంద్రాన్ని బాగా విస్తరించమన్నారు.
మెరిడిత్ ఆశయం కూడా యిదే కదా.
ప్రభువు ఆదేశం, అతని ఆశయం ఒకటే.
అతగాడి ఆనందానికి పట్టపగ్గాలు లేవు ఆ వేళ.
అదే బాబా వారి మొదటి రోజు లండన్‌లో.
ఆ రాత్రి బాబా వారి పడక కిట్టీ గదిలోనే. మంచంపై ప్రభువు పడుకొన్నారు.
మంచం దగ్గరగా ఆఘా ఆలీ పడుకొన్నారు నేలపైన.
ఛాన్‌జీ, రుస్తుంల పడక హెర్బర్ట్ గదిలో. వాళ్ళ పరుపు చుట్టలు విప్పారు.
నడుం వాల్చారు. మీ పరుపు మీ వెంటనే వుండాలన్నది ప్రభువు ఆదేశం కదా!
మర్నాడు, సెప్టెంబరు 13వ తేదీ కాంబెమార్టిట్‌కి బయలుదేరారు బాబా.
ఈవాళ ఆదివారం అందరికీ శలవు దినం.
విశ్వ విధాతకి శలవు ఎవరిస్తారు. ఒక గంటకాదు,
ఒక్క క్షణం విశ్రాంతి తీసుకొంటే ఏమవుతుంది?
ఇది ఊహకి అందని సంగతి సృష్టి గతి తప్పవచ్చు.
అల్లకల్లోలం ఏర్పడవచ్చు. ఇంకేదయినా ఉపద్రవం రావచ్చు. అప్పుడు ఏమవుతుందో,
ఎలా వుంటుందో వూహించలేము. ఇప్పటికే ప్రపంచంలో అడపాదడపా
అనేక ఉపద్రవాలు వస్తున్నాయి. కానీ అవి అన్నీ పరంధాముడు లీల మేరకి వస్తున్నాయి
విశ్వ కార్యక్రమావసరం తీరగానే, చరాచర జగత్తు వూపిరి తీసుకొంటోంది.
కొత్త ఆధ్యాయానికి తెర తీస్తోంది. ఇంతకీ ఈ విషయ ప్రస్తావన వచ్చింది,
ఆదివారం పేరు చెప్పి, ఏది ఏమయినా వొకటి మాత్రం వొప్పు కోవాలి.
మానవ మేధస్సుకి అందని అంశం – భగవంతుని లీలలు, సృష్టికర్త పనితీరు.
బాబా వారి ప్రయాణానికి మెరిడిత్ పెద్ద కారు అద్దెకి తీసుకొన్నాడు.
రాజులా ప్రయాణం చేయాలట. కొంబె మార్టిట దగ్గరేమీ కాదు.

232 మైళ్ళ దూరం. అక్కడికి కాస్తంత దూరం తూర్పు చల్లా కొంబె..
కారు ఎక్కే ముందు, బాబావారు కిట్టీని అడిగారు, నీకేమైనా కావాలా అని.
బాబావారిలా అడుగుతారని వూహించని కిట్టీ, కాసేపు తటపటాయించింది.
"నాకేమి కావాలి ప్రభూ! నీ సేవా భాగ్యం కల్గించు అంది.
నీ చల్లని దీవెనలు వుంటే చాలు నాకదే పదివేలు అంది.
నిన్ను అధికంగా ప్రేమించే శక్తిని ప్రసాదించు అని వేడుకొంది.
ఇంకో చిన్న కోరిక మీరు మన్నిస్తామంటే అంది.
ప్రభువు చిరునవ్వు నవ్వాడు "ఏమా కోరిక?" మంచితనం పెంచు నాలో ప్రభూ!
నలుగురితో అరమరికలు లేకుండా కలిసిపోయే శక్తిని అనుగ్రహించు దేవదేవా.
"తప్పకుండా! నీ అభీష్టం నెరవేరుతుంది త్వరలోనే", అంటూ బాబా వారు
గడప దాటారు. కారు ఎక్కారు. అప్పుడు గడియారం ఏడుకొట్టింది
"బాబావారి ప్రక్కనే మెరిడిత్‌స్టార్, ఆఘా, ఆదీ కూర్చొన్నారు.
వీళ్ళకి ఎదురుగా కూర్చొన్నారు ఛాన్‌జీ, హెర్బర్ట్.
ఈ ఇద్దరు సీట్లు అవసరమయితే మడతపెట్టవచ్చట.
మరి ఇహ రుస్తుం మహాశయుడు సూటుకేసులు,
పరుపు చుట్టలు వగైరా శ్రద్ధగా సర్దాడు.
డ్రైవరు ప్రక్క సీట్లో చతికలబడ్డాడు. ఈ కారుకి వో ప్రత్యేకత వుందట.
కారులో కూర్చున్న వాళ్ళ మాటలు, డ్రైవర్‌కి వినబడవు.
అది ఎలాగంటే, డ్రైవరు సీటు వెనుక వో పెద్ద అద్దం పెట్టారు.
అతగాడు కన్పిస్తాడు వెనక కూర్చున్నవాళ్ళకి.
వెనకవాళ్ళు అతనికి కన్పిస్తారు కానీ, వాళ్ళ మాట అతనికి వినపడదు.
డ్రైవరు సీటుకీ, ఈ అద్దం గోడకీ మధ్య కాస్తంత జాగా వుంచారు.
ఈ జాగా ఎందుకట? సామాన్లు పెట్టుకోవడానికి.
మన రుస్తుంగారు పరుపు చుట్టల్ని ఈ జాగాలోనే పెట్టాడు.
కారు లండన్ వీధులు దాటింది. జాతీయ రహదారి పట్టింది.
గ్రేట్ వెస్ట్ రోడ్డు ఎక్కింది.
స్లో, రీడింగ్, న్యూబరీ, మార్లబరో, చిప్పెన్ హామ్ దాటింది.
బాత్‌లో కాసేపు ఆగింది.
అక్కడ డాక్టరు విట్‌బై గారు బాబా వారి దర్శనం కోసం తపిస్తున్నాడు.
మెరిడిత్ ప్రభువుని ఆయన దగ్గరకి తీసుకు వెళ్ళాడు.
పరిచయం చేశాడు. ఆ బ్రిటిషు దొర గారు సద్గురువుకి ప్రణమిల్లాడు.
ప్రభువు ఆశీస్సులు యిచ్చాడు.

ధన్యమైంది నా జీవితం ఈ ఘడియ కోసమే ఎదురు చూస్తోందన్నాడు అతగాడు.
కారు మళ్ళీ కదిలింది. వేల్స్ దాటింది. గ్లాస్టోన్ బరీలో అడుగు పెట్టింది.
స్థలపురాణం ప్రకారం, ఈ వూరికి క్రీస్తు చరిత్రలో విశిష్ట స్థానం వుంది.
ఇక్కడే, ఈ వూళ్ళోనో ఏసు ప్రభువు వాడిన మధుపాత్రని పాతిపెట్టారుట.
ఆ పాత్ర ప్రత్యేకత! ఇహ రేపు శిలవ వేస్తారనగా,
ఈ సాయంత్రం, ప్రభువు శిష్యులతో కలిసి భోజనం చేశాడు.
ఆనాటి సాంప్రదాయం ప్రకారం మధువు సేవించాడు.
ఇదే ఆఖరి భోజనం ఆనాటి అవతారుడిది. ఆ వేళ శిష్యుల కాళ్ళు కడిగాడు.
ప్రేమగా మెసలండి అని హితవు పలికాడు. నేను మీ అందరితో ప్రేమగా వున్నాను.
మీరందరూ అలానే ప్రేమగా మెసలండి అని శెలవిచ్చాడు.
ఇదే అఖరి సందేశం కూడా. ఆ రోజు గురువారం.
రెండు రోజుల తర్వాత ఆదివారం శిలువపై వెలిశాడు.
అలా ఆఖరి భోజనం నాటి మదుపాత్ర గ్లాస్టోన్‌బరీని పుణ్యక్షేత్రం చేసింది.
ఆధునికావతారుడు ఆ వూరిని పావనం చేశాడు తన పాధధూళితో.
మరో కథనం ప్రకారం, అలనాటి పాత్రకి,
అదే గిన్నెకి మరో విశిష్టత వుందంటారు.
దయామయుడు శిలవ చేయబడ్డాడు నిర్ధాక్షిణ్యంగా.
రక్తం కారుతోంది. శిష్యులు తట్టుకోలేకపోయారు ఆ దృశ్యం చూస్తూ.
ప్రభువు రక్తాన్ని గిన్నెలోకి పట్టారు. జొసెఫ్ అన్నాయన ఆ గిన్నెని గ్లాస్టోన్ బరీకి తీసుకువచ్చాడు అని కొందరు అంటారు. 1610 వరకూ ఆ గిన్నె భద్రంగా వున్నట్లు చారిత్రిక ఆధారాలున్నాయి. ఫ్రెంచి విప్లవ కాలంలో,
అంటే 1789-1799 సంవత్సరాల మధ్య
ఆ గిన్నె మాయమయింది. ఎంత వెదికినప్పటికీ ఇప్పటి వరకూ
దొరకలేదన్నది మరొక కథ. ఆరేళ్ళ క్రిందట అంటే 2014 మార్చి నెలలో
స్పెయిన్ చరిత్రకారులు యిద్దరు మాకు దొరికిందాగిన్నె అన్నారు.
ఉత్తర స్పెయిన్‌లో వో చర్చిలో చూశాము. 11వ శతాబ్దం నుంచీ ఆ గిన్నె అక్కడవుందట అని సగర్వంగా ప్రకటించారు. కానీ, వారి మాటని అంతగా ఎవరూ పట్టించుకొన్న దాఖలా లేదు. మెహెరీశంలో గ్లాస్టోన్‌బరీకి వో విశిష్టత వుంది.
రాముడిగా, కృష్ణుడిగా తాను తిరిగిన ప్రదేశాలను మెహెరావతారుడు
దర్శించిన సంగతి పాఠకులకి తెలుసు. మహమ్మద్ ప్రవక్త పావనం చేసిన
వివిధ ప్రదేశాలనీ మెహెరుడు సందర్శించాడు తన ఇరాన్ యాత్రలోనూ,

ఆ దరిమిలానూ. ఇప్పుడు, మెరిడిత్ స్టార్ పేరు చెప్పి,
క్రీస్తు చరిత్రతో ముడిపడిన ప్రాంతానికై షెరియార్జీ సుతుడు వచ్చాడు.
గ్లాస్టోన్ బరీకి కొత్త ఊపిరి పోసి, మన అందరికీ దర్శనీయ క్షేత్రం చేశాడు.
లండన్ నుంచి కాంబోయారిటన్ దగ్గర కాదన్న సంగతి పాఠకులకి తెలుసు.
సుమారు పది గంటల ప్రయాణం. సెప్టెంబరు నెలలో ఎండ కనబడదు ఇంగ్లాండ్‌లో.
తుప్పర్లు పడుతుంటాయి. సూర్యుడు మబ్బుల చాటునే దాక్కొంటాడు.
కానీ ఈ వేళ ఆకాశం బోసి పోయింది.
మేఘాలు కనుచూపు మేరలో కనబడటం లేదు.
సూర్యుడు "నేనున్నానండోయి", అంటున్నాడు. మరీ అంత ఎండలేదు కాని
కొంచెం ఎండగానే వుంది. సెప్టెంబరు నెలలో సూర్యుడిని యిలా చూడటం యిదే
ప్రధమం అన్నాడు కారు డ్రైవరు. నిజమా అని అడిగాడు రుస్తుం. అవునండీ, నిజమే.
మా దేశంలో సూర్యుడు కనబడడు సెప్టెంబరులో ఎప్పుడూ, అన్నాడు డ్రైవరు.
వోహెూ! అలాగా! ఆధ్యాత్మిక భానుడు వస్తుంటే ప్రపంచ భానుడు ఎదురు వస్తున్నాడు,
స్వాగతం పలకడానికి. ఈ వేళ వొక్క రోజే కాదు, బాబా వారు ఇంగ్లాండ్‌లో వున్నన్ని
రోజులు, భానుడు శెలవు తీసుకోలేదు వొక్కనాడయినా. మెహెరుడూ అంతే, తమ
విశ్వకార్యక్రమం నిరంతరాయంగా చేస్తునే వున్నారు. ఒక్కరోజూ మానలేదు.
ఇదిగో ఇప్పుడూ కాంబెమార్టిన్‌కి కార్లో వెడుతూ కూడా.
తలపాగా కట్టుకొన్నారు. కంబళి కప్పుకొన్నారు.
చేతులు, వ్రేళ్ళు లయబద్ధంగా కదులుతున్నాయి.
ఇది మీకు ఎలా తెలుసు? కంబళీ ముసుగు ఏమీ దాచటం లేదు.
చలి వేస్తే కప్పుకొన్నారు. కంబళిని అడిగారంట. దరిమిల శిష్యులు.
ఇది చలికి కాదు. ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసమే" అన్నారుట.
అంటే కారులో వున్నా రైల్లో వున్నా, ఎక్కడున్నా, అది ఏ సమయమైనా
కునుకు తీయడు. జగద్రక్షకుడు. కొంబె మార్టిన్ చేరేసరికి సాయంత్రం
అయిదు అయింది. పది గంటల ప్రయాణమన్న మాట లండన్ నుంచి.
ఇక్కడికి కొంచెం దూరంలో వుంది తూర్పు చల్లా కొంబె.
అదొక 60 ఎకరాల క్షేత్రం. బాబావారి రాక కోసం ఎదురు చూస్తున్నారు భక్తులు,
భగవదన్వేషకులు. ఎస్తర్ రోస్, ఆమె తమ్ముడు కెన్నెత్ రిచర్డ్ మేయర్, మిలో షాటక్,
టామ్ షార్పెలీ, హెల్మర్, డొరోతీ కజిన్స్, మార్గరెట్ స్టార్, ఛార్లిస్ పర్ధం ప్రభృతులు
ఉదయాన్నే వచ్చారక్కడికి. మెహెరుడి ఇంగ్లాండ్ యాత్రకి
విరాళాల్చిన దాతలు వీరందరూ.

–సశేషం

ఆంధ్రా పర్యటనలో

# కూల్‌డ్రింక్స్ ప్రసాదం



మెహెర్‌బాబా ఆంధ్రా పర్యటనలో వున్న సమయమిది. ఆ పర్యటనలో భాగంగా మెహెర్‌బాబా మచిలీపట్నం నుండి కారులో ఏలూరుకు వయా గుడివాడ బయల్దేరారు. బాబావారి కారు వెనక్కాల ఓ బస్సులో మండలివారు, ఇతర ప్రేమికులున్నారు. దాని వెనక్కాల మండలి వారి సామాన్లుతో గల ఓ ట్రక్కు, ఇతర వాహనశ్రేణి వుంది. అందరికంటే ముందుగావున్న బాబావారి కారు గుడివాడ పట్టణ నాలుగు రోడ్ల కూడలి దగ్గరకు రాగానే అకస్మాత్తుగా ఆగిపోయింది. బాబా తన కారుని ఉన్నట్లుండి ఆపమన్నారు.

దాంతో కారు వెనక్కాల వస్తున్న వారందరి కార్లు ఆగిపోయాయి.

ఎందుకు బాబా కారు ఆపారో ఎవరికీ తెలియదు.

ఎవరికి తోచిన విధంగా వారు ఆలోచించసాగారు.

ఇలా ఓ 15 నిముషాలు గడిచింది. ఇంతలో కొంతమంది స్థానిక గ్రామస్తులు ఆడ, మగవారు, వారి పిల్లలు పరుగు పరుగున బాబావారి కారు ఆగివున్న వైపు రావడం గమనించారు. వీరందరూ చూడ్డానికి పేద పల్లెటూరివారిలా వున్నారు. అవతారుడు తమ గ్రామం గుండా ఆ రోజు వెళ్తున్నారని ముందుగానే తెలుసుకున్న ఆ గ్రామస్తులు, ఆ దారిన బాబా వెళ్తున్నప్పుడు దూరంగా రోడ్డుకి ఓ ప్రక్కన నిల్చుని కొన్ని క్షణాలైనా దర్శించుకుందామనుకున్నారు. ఐతే బాబా, అక్కడికి రావల్సిన సమయంకంటే 15 నిముషాలు ముందుగానే వచ్చారు. అలా ముందుగా వచ్చినా, అన్నీ ఎరిగిన అవతారుడు వారి రాక కోసం ఎదురుచూస్తూ అలా మార్గమధ్యంలో ఆగారు.

అదన్నమాట సంగతి!!

ఇది తెలిసిన గ్రామస్తుల కళ్ళు చెమ్మగిల్లాయి.

రెండు చేతులూ జోడించి అవతారుని దివ్యదర్శనం తృప్తిగా చేసుకున్నారు.

ఇదిలావుంటే, ఆ నాలుగురోడ్ల కూడలిలో ఓ మూలగా కూల్ డ్రింకులు,

సోడాలు ఇత్యాదులు అముకునేవాని ఒకేఒక చిన్న బడ్డీ కొట్టు వుంది.
ఈ విచ్చేసిన గ్రామస్తులందరికీ ఇవ్వడానికి సరిపడా
కూల్ డ్రింక్‌లు ఆ కొట్టువాని దగ్గర వున్నాయేమో కనుక్కోమన్నారు బాబా.
వీరందరూ కలిపి రమారమిన 80 మంది పైబడి వున్నారు.
ఆ కొట్టు యజమాని అందరికీ ఇవ్వడానికి సరిపడినంత సరుకు తన వద్ద వుందన్నాడు.
ప్రతివానికి ఓ కూల్ డ్రింక్ బాటిల్ ఇవ్వమన్నారు బాబా.
ఇంతమంది ఆరాధిస్తున్న ఈ మహానుభావుడెవరని,
ఆ కొట్టు యజమాని బాబా బాబాని ఉద్దేశించి
స్థానిక ప్రేమిక బృందాన్ని అడిగితే, ఈయన సాక్షాత్తూ శ్రీరామచంద్రుడు.
మెహెర్‌బాబాగా నేడు మన మధ్యకు వచ్చారని వారు చెప్పారు.
ఆ శీతలపానీయాల బాటిల్సుని ఓపెన్ చేసి బాబావారి చేతికి ఇస్తే
బాబా స్వయంగా విచ్చేసిన పల్లె ప్రేమికులందరికీ ఒక్కొక్కరికీ
ప్రేమగా, తన ప్రసాదంగా వారి చేతికి అందించారు.
కూల్ డ్రింక్ బాటిల్స్ అందరికీ ఇచ్చాక,
ఆ కొట్టువాని దగ్గర మరిక స్టాకు లేదు.
విచ్చేసిన గ్రామస్తులు, ఆ కొట్టు యజమాని కూడా తృప్తిగా
అవతారుని దర్శనం చేసుకున్నామనుకున్నారు.
కూల్‌డ్రింక్స్ మొత్తానికి ఇవ్వవల్సిన డబ్బు చెల్లించమని
బాబా మండలివారికి చెప్పినప్పుడు,
బాబా నుండి డబ్బు తీసుకోవడానికి ఇష్టపడలేదు ఆ కొట్టు యజమాని.
మానవ రూపధారిగా వచ్చిన అవతారునికి తాను ప్రేమకానుకగా
కూల్‌డ్రింక్స్ సరఫరా చేయడం తన భాగ్యం అని భావించాడతను.
అందుకు బాబా ఒప్పుకోలేదు.
తానిచ్చే డబ్బు తీసుకోవల్సిందేనని అన్నారు బాబా.
ఇది కూల్‌డ్రింక్స్ ఖరీదు కాదు. తన ప్రేమ ప్రసాదమన్నారు.
దాంతో, మండలివారిచ్చిన నగదును అంగీకరించాడు ఆ కొట్టు యజమాని.
ఆ పిదప బాబా బృందం తమ వాహనాలలో ముందుకు బయల్దేరారు.

***

**అవతారుని దివ్య సంభాషణా చాతుర్యం మెహెరాబాద్ సహవాస్ శీర్షికలో కనపడుతుంది. ఆసాంతం చదవండి! చదివించండి!!**

# లక్ష్మీ హరీష్ కాంబ్లే

**శ్రీ జల్లు వెంకట మెహెర్, మెహెరాబాద్**



మెహెరాబాద్‌లోని మెహెర్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న శ్రీమతి లక్ష్మీ కాంబ్లే బాబా ప్రేమికులు చాలామందికి సుపరిచితురాలే!! ఆమె మహారాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖలో గ్రేడ్ - 2 మాట్రిన్‌గా పనిచేసి రిటైరయ్యారు. మెహెరాబాద్‌లో స్థిరపడ్డ శ్రీమతి లక్ష్మి గత రెండు దశాబ్దాలుగా స్థానిక మెహెర్‌ఆసుపత్రిలో స్వచ్ఛంద సేవకురాలిగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది ప్రథమార్థంలో మెహెరాబాద్‌లో వుంటున్న మెహెర్ బుజ్జితో కలిసి కొవ్వూరులోని మెహెర్‌స్థాన్, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు బాబా కేంద్రాలను ఆమె సందర్శించారు. బాబా పరివారంతో తనకు గల అనుభవాలను అనేక ఆసక్తికర విషయాలను ఆమె బాబా ప్రేమికులతో పంచుకున్నారు. శ్రీమతి లక్ష్మి కాంబ్లే ఆదీ కె ఇరానీ తల్లి శ్రీమతి గుల్మాయి దగ్గర, మెహెరాజాద్‌లో మెహెరామాయికి కొంతకాలం సహాయకురాలిగా పనిచేశారు. ఈ పనికి అవతారుడే స్వయంగా ఆమెని ఎంపిక చేశారు.

శ్రీమతి లక్ష్మీ కాంబ్లే చెప్పిన విషయాలను ఇకపై ఆమె మాటల్లోనే ఆలకిద్దాం!!.

***

మెహెర్‌బాబా తన అవతార కార్యక్రమం కోసం ఎంచుకున్న అరంగ్రాం మా స్వగ్రామం. మా నాన్నకు చదువు అబ్బలేదు. ఆయన చిన్నతనంలో పశువులకాపరిగా వున్నాడు. మెహెర్‌బాబా ప్రప్రథమంగా ఆరంగాం రావడం, అక్కడున్న పెద్ద వేప చెట్టు నీడలో కూర్చున్నారన్న సంగతి బాబా ప్రేమికులందరికీ తెలుసు కదా!! అలా కూర్చున్న బాబా దగ్గర్లోని రైల్వే గేటు దగ్గర పశువుల్ని చూసుకుంటున్న మా నాన్నను చూసి, తన దగ్గరగా పిలిచి ఏం చదువుతున్నావని వాకబు చేశారు. గ్రామంలో స్కూలు లేదు. చదువెక్కడదని మా నాన్న జవాబివ్వడంతో, నేను చదివిస్తాను. తన స్కూలుకి రమ్మనమని పిలిచారు. తమ ఇంట్లో ఒప్పుకోరేమోనని సంశయిస్తుంటే, బాబా మా ఇంటికి వచ్చి పెద్దవాళ్ళని ఒప్పించి మా నాయన్ని తన స్కూల్లో చేర్పించారు బాబా.

అలా బాబా నీడలో పెరిగి పెద్దయినవాడు మా నాయన. మేం ఇద్దరు ఆడపిల్లలం. మా సోదరి చిన్నతనంలోనే చనిపోయింది. నా పేరు **"లక్ష్మి"** అని బాబానే పెట్టారు. ఆరంగాంలో అప్పట్లో ఐదవ తరగతి వరకూ ప్రాథమిక పాఠశాల వుండేది. ఆ స్కూల్లో నేను చదువుకొన్నాను. వీలు చిక్కినప్పుడల్లా నేను మండలి హాలులో బాబా దర్శనార్థం వెళ్ళేదాన్ని. బాబా పాదస్పర్శ కోసం తహతహలాడేదాన్ని. ఆ రోజుల్లో మాబోటి పేదవాళ్ళం ఎక్కువగా జొన్న రొట్టెలు తినేవాళ్ళం. బాబా మండలి హాలులో వుంటే గోధుమ రొట్టెలు మాకు ప్రసాదంగా పెట్టేవారు. ఓసారి అలా బాబా మండలి హాలులో వుండగా ఆయన ఎదుట నిలబడ్డాను. నన్ను చూసి ఏం కావాలని అడిగారు బాబా. గోధుమ రొట్టెలు తినాలని ఉందన్నాను. బాబా ఏమనుకున్నారో ఏమో, ఆ మర్నాడు నుండి నాకు ప్రతిరోజూ పాలు-రొట్టెలు పెట్టమని, కిచెన్ చూస్తున్న మాసాజీని ఆదేశించారు. అలా రోజూ ఉదయాన్నే స్నానం చేసి బాబా ప్రసాదం కోసం మాసాజీ దగ్గరకి వెళ్ళేదాన్ని. ఐతే, ఒకరోజున మాసాజీకి ఏమయ్యిందో ఏమోకాని, నాకిచ్చే పాలు, రొట్టె ఉన్న ప్లేటును ఎప్పటిలా ప్రేమగా నా చేతికి ఇవ్వకుండా నా ముందుకి దూరం నుండి విసురుగా విసిరేశారు. ఇది నాకు బాధకల్గించింది. అలా విసిరేసిన ప్లేటును నేను ముట్టుకోలేదు. ఇది గమనించిన మండలి సభ్యుడైన విష్ణు మాస్టారు నన్ను తినమని, కోపం వద్దని, చాలాసేపు బ్రతిమిలాడాడు. ఐనా నేను ఆ ప్లేటుకేసి చూడను కూడా చూడలేదు. ఆ తర్వాత బాబా వచ్చి విషయం ఆరా తీశారు. బాబాకు జరిగినదంతా ఉన్నదిఉన్నట్లు చెప్పాను. బాబా మాసాజీని చివాట్లు పెట్టారు. బాబా నా దగ్గరగా వచ్చి, ప్రేమగా గోరుముద్దలు తినిపించినట్లు తినిపించారు. ఇదంతా నా అదృష్టమనుకున్నాను. కళ్ళలో నీళ్ళు చెమ్మరిల్లాయి.

## గుల్మాయి దగ్గర...

ఇదిలా వుండగా నేను ఆరో తరగతిలో చేరాను. ప్రతిరోజూ అహ్మద్‌నగర్ వెళ్ళి వస్తుండేదాన్ని. ఆరంగాం నుండి సుమారు ఏడు కిలో మీటర్ల దూరం నడిచి వెళ్ళాల్సివచ్చేది. నాతోపాటు ఆరంగాం నుండి తొమ్మిదిమంది అబ్బాయిలు కూడా నగర్ స్కూల్‌కి వచ్చేవారు. ఆడపిల్లను నేనొక్కదాన్నే. నాకు ఇబ్బందిగా వుండేది. ఓ రోజున మెహెరాజాద్ నుండి బాబా మెహెరాబాద్‌కు కారులో వస్తున్నారు. ఆది కె ఇరానీ కారు డ్రైవ్ చేస్తున్నారు. నేను ఆ కారుకి అడ్డంగా వెళ్ళి నిల్చున్నాను. బాబా ఏమైందని అడిగారు. ఇలా రోజూ నగర్‌కు నడుచుకుంటూ వెళ్ళిరావడం కష్టంగా వుందని చెప్పాను. బాబా నన్ను చూసి నవ్వుతూ, ముందు నన్ను మెహెరాబాద్‌కి వెళ్ళనివ్వు. ఆ తర్వాత నీ సమస్య తీరుస్తానన్నట్లు నాకేసి చూశారు. ఆ మాట ప్రకారం నన్ను నగర్‌లోనే వుండి చదువుకునేలా ఖైఖుస్రూ క్వార్టర్స్‌లో గుల్మాయి గారింట

నాకు బస ఏర్పాటు చేశారు. నన్ను గుల్మాయికి తోడుగా వుండమని సూచించారు. అలా గుల్మాయికి సేవ చేస్తూ నగర్‌లో 1955 నుండి 1962 వరకూ వుండి నా చదువు పూర్తి చేశాను. గుల్మాయితో కలిసి తరచు బాబా దర్శనార్థం మండలిహాలుకు వెళ్ళేదాన్ని. అలాంటి సందర్భంలో ఏం జరిగిందంటే, ఒక రోజున బాబాకి ఓ మంచి అందమైన పూలదండను ఓ ప్రేమికుడు వేశాడు. ఆ పూలదండపై నా దృష్టి వుండటాన్ని గమనించి, బాబా నాకు ఆ దండను ఇచ్చారు. ఇది గుల్మాయికి నచ్చలేదు. పూలదండ కోసం బాబాని ఎందుకు అడిగావని ఆమె నాపై చికాకు పడింది. మేం ఖుస్రూ క్వార్టర్స్‌కు తిరిగి వెళ్ళాక నాతో తెచ్చిన పూలదండని ఉపాసిని మహారాజు చిత్రపటానికి వేశాను. దాంతో గుల్మాయి ఎంతో సంతోషించి నన్ను దగ్గరగా తీసుకుంది. గట్టిగా ఆలింగనం చేసుకుంది.

**బాబాకి టీ ఇచ్చాను**

ఓ రోజున బాబా గుల్మాయిని చూడ్డానికై ఖుస్రూ క్వార్టర్స్‌కు వచ్చారు. అలా బాబా వస్తున్నారని మాకు తెలిసి నేను గుల్మాయిని చాలా అందంగా తయారు చేశాను. బాబా వచ్చి కారు దిగగానే గుల్మాయిని, నన్ను చూసిన బాబా ఆరోగ్యంగా వున్నారంటూ సంజ్ఞ చేశారు. ఆ సమయంలో బాబా టీ కావాలన్నారు. నన్ను టీ తీసుకురమ్మన్నారు. లోకరక్షకుడికి నేను ఇచ్చే టీలో ఏదైనా లోపముంటేనో అని భయపడ్డాను. దాంతో విదేశాల్లో మాదిరి టీ డికాషన్, వేడి పాలు, పంచదార, అన్నీ వేరు వేరుగా ఓ ట్రేలో తీసుకెళ్ళాను. ఎంత పంచదార వేయాలి, ఎన్ని పాలు వేయాలో బాబానే చూపించారు. అలా బాబాకి కప్పు-సాసరులో టీ పోసి ఇచ్చాను. బాబా ఒక చిన్న గుక్క తాగి, మిగిలినదంతా నన్ను తాగమని నా చేతికి ఇచ్చారు. ఈ సమయంలో నాకు చాలా భయం వేసింది. రుచి బాగాలేక నాకిచ్చాసారనుకున్నా. ఆదీజీ తిడతారేమో అనుకున్నా. అలా బాబా ఇచ్చిన టీని ఆయన ప్రసాదంగా పూర్తిగా త్రాగాను. బాబా అక్కడ్నుంచి మెహెరాజాద్‌కి వెళ్ళాక అక్కడున్న వారంతా నన్ను ఆలింగనం చేసుకుని నా అదృష్టాన్ని కొనియాడారు. నేనెంతో అదృష్టశాలినన్నారు. బాబా రుచి చూసిన టీని నీకు దొరికిందన్నారు. మేం ఎన్నో సంవత్సరాలుగా ఆయన వెనక తిరుగుతున్నా కనీసం మంచి నీళ్ళు కూడా ఎన్నడూ ఇవ్వలేదని వారి బాధను వెళ్ళగక్కారు.

**మెహెరామాయికి సేవకురాలిగా .....**

ఆ సమయంలో నేను ముంబాయి రైల్వే హాస్పిటల్‌లో పనిచేస్తున్నాను. అహ్మద్‌నగర్‌కి దగ్గర్లోని ఖేడ్‌గాంలో మాకు తెలిసిన వారి పిల్లవాని వివాహానికి రెండు రోజులు సెలవుపై వచ్చాను. అక్కడ పెళ్ళి హడావిడిలో ఉండగా నన్ను జాల్ దస్తూర్ చూశారు. జాల్‌భాయ్‌కి ఆ వివాహంతో ఎలాంటి సంబంధం లేదు. ఆయన్ని చూస్తూనే

ఈయనెందుకు ఇక్కడకు వస్తున్నాడనిపించింది. ఆయన తిన్నగా నా దగ్గరకు వచ్చి రేపట్నుంచి నీవు మెహెరాజాద్‌లో మెహెరామాయికి సేవకురాలిగా వుండాలన్నారు. ఇది భాగ్యమని భావించి, వెంటనే వెనుకంజ వేయకుండా ఉద్యోగానికి సెలవు పొడిగించాలని టెలిగ్రాం ఇచ్చాను. నేను మెహెరామాయి దగ్గరకి వెళ్ళేసరికి ఆమె చాలా నీరసంగా వున్నారు. ప్రక్కన సహాయం లేకపోతే లేవలేని పరిస్థితిలో ఉన్నారామె. నన్ను చూసి లక్ష్మీ నా కోసమే వచ్చావా? అంటూ ప్రేమగా దగ్గరకు తీసుకున్నారు. అప్పటికే ఆమె ఏమీ తినడం లేదు. సెలైన్ ఇవ్వాల్సిన పరిస్థితిలో వుందామె. మెహెరామాయి చేతిని పట్టుకుంటే దూదిపింజవలె ఉంది. అలాంటి సునిశిత శరీరానికి నా చేతులతో సూదిని గుచ్చాల్సి రావడం నాకు చాలా బాధ అనిపించింది.

నా కళ్ళలో నీళ్ళు పెల్లుబికాయి. అలా ఆమెకు సేవలందించే భాగ్యం లభించడం నా అదృష్టమే!!. ఇక ఆమె బాబాలో ఐక్యమవ్వడానికి ఆఖరి క్షణాల్లో ఉన్నారన్న సంగతి నాకు అర్థమయ్యింది. బాబా చెల్లెలు మణీజా నాకెప్పుడో ఇచ్చిన బాబా ఫోటో నా హ్యాండ్ బ్యాగ్‌లో ఎప్పుడూ ఉంచుకునేదాన్ని. అది గుర్తుకు వచ్చి, ఆమె ఆఖరి ఘడియల్లో బాబా ఫోటోను మెహెరా దగ్గర పెట్టాలని నేను ప్రయత్నిస్తుంటే, బాబా కూడా ఫోటోతో పాటు మెహెరా దగ్గరకు వచ్చి బాబా తన చేతులతో మెహెరాను తీసుకొని వెళ్ళడాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను.

బహుశా అది నా భ్రాంతి అనుకుందామా అంటే, ఎన్నటికీ కాదు.

నా కళ్ళు చూసిన నిజమదని, శ్రీమతి లక్ష్మి చెప్పడం ముగించారు.

**అవతారునితో, ఆయన సన్నిహిత మండలితో ఆత్మీయ అనుబంధంగల శ్రీమతి లక్ష్మీ హరీష్ కాంబ్లే ధన్యచరితురాలు.**

# నరసరావుపేటలో ప్రత్యేక సహవాస్



నరసరావుపేట బాబా కేంద్రంలో అవతారుని విగ్రహ ప్రతిష్టాపన రజతోత్సవాన్ని ఘనంగా వర్చ్యువల్ సహవాస్ ద్వారా 2020 ఆగస్టు 10న జరుపుకున్నామని శ్రీ వంకాయల అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సహవాస్ ఏర్పాటులో బాబా ప్రేమికులు శ్రీ మెహెర్ సుధాకర్ తమకెంతగానో సహాయం అందజేశారని ఆయన అన్నారు. స్థానిక బాబా ప్రేమికలు ఈ సహవాస్‌లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని శ్రీ వంకాయల తెలిపారు.

# మెహెరాబాద్ తెలుగు-గుజరాతీల సహవాస్

## 1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ

**(గత సంచిక తరువాయి)**

తెలుగు బాబా ప్రేమికుడైన శ్రీ ఏ.సి.యస్. చారి బాబావారి మెడలో
పూలదండ వేసి, బాబాతో ఫోటో దిగాలనివుందన్నాడు.
అలాగే, తనకు రెండుసార్లు బాబా ఆలింగనం కావాలని కోరాడు.
ఇలా ఎందుకంటే, ఒకటి తన కోసం, రెండవది సహవాస్‌కి రాలేకపోయిన
తన భార్య, తన స్నేహితుని కోసమని అన్నాడాయన.
తన స్నేహితుడు రాలేకపోయినా బాబావారి కోసం ఒక శాలువాను
తమ ప్రేమ కానుకగా పంపాడని శ్రీ చారి అన్నారు.
ఆయన కోరిన రెండు కోరికలు తీర్చుతూ శ్రీ చారికి రెండుసార్లు ఆలింగనం ఇచ్చారు.
బాబా నవ్వుతూ మరోసారి అంటే మూడవసారి కూడా
శ్రీ చారితో ఫోటో తీయించుకున్నారు. అదెలాగంటే, సహవాస్ వేదికపైన
బాబా పాదాల వద్ద కూర్చునివున్న యోగి సిద్ధానందభారతి సలహా మేరకు
శ్రీ చారి తనతో తీసుకువచ్చిన శాలువాను బాబా భుజాన చుట్టూతా వేశాడు.
ఈ సమయంలోనే మరో ఫోటో తీశారు.
ముంబాయి నుండి వచ్చిన నోషిర్ ఇరాని, ఓ పార్సీ పూజారి మాదిరి
తన మూతి చూట్టూతా తెల్లని గుడ్డ నొకదాన్ని కట్టుకుని
బాబా దర్శనం కోసం వచ్చాడు. ఆతను ఫ్లూ జ్వరంతో బాధపడుతున్నాడు.
ఆ వైరస్ అందరికీ అంటరాదని ఆ మాదిరిగా వచ్చానని చెప్పాడు.
బాబా ఆతనికి ప్రేమగా ఆలింగనం ఇచ్చారు.
ఆ తర్వాత ఆ వైరస్ తాకకుండా సబ్బుతో చేతులు కడుక్కున్నారు.
ఆ సమయంలో యోగి సిద్ధానందభారతి అన్న మాటలకు స్పందిస్తూ,
"వారెంతో ప్రేమతో తన దగ్గరకి వచ్చినప్పుడు వారి మనోభావాలను
కించపరచకూడదు కదా!!" అన్నారు బాబా.
మెహెరాబాద్‌లో కొన్నాళ్ళక్రితం వరకూ కుష్ఠు రోగుల కాలనీ వుండేది.
అక్కడున్న రోగులకు ప్రతిరోజూ తాను స్నానం చేయించేవాడినని

యోగి సిద్ధానందభారతికి గుర్తుచేశారు బాబా.
ఇప్పుడు నీవు, నా భక్తునిగా ఆ పనిని కొనసాగించమని ఆయనకు సూచించారు.
ఈ విశ్వానికి నేను వెలుగు ప్రసాదిస్తున్నాను.
నీకు ఆ సత్యం తెలిసినప్పుడు నీకు నా గురించి బాగా తెలియడమే కాకుండా,
నా నిజ దివ్యదర్శనం నీకు లభిస్తుందన్నారు.
అంతక్రితం శ్రీ ఏసియస్ చారి బహుకరించిన శాలువాను
యోగి సిద్ధానందభారతికి అందజేశారు.
ఆ తర్వాత చాలాకాలంగా పరిచయమన్న ఓ ప్రేమికుడి పేరు గురించి
బాబా వాకబు చేస్తుంటే, బాబా నీకే బాగా తెలుసన్నాడు ప్రక్కనే వున్న
మండలి సభ్యుడైన ఏరుచ్ జెస్సావాలా. నాకు ఎవరి పేర్లు గుర్తుండవు.
నేను అందరిలో వున్నాను. అందరిలోవున్న నన్ను చూసుకుంటుంటా అన్నారు బాబా.
ఇదేమీ పెద్దమాట కాదు. ఇది సత్యం. వాస్తవం.
ఇది నా అనుభవం. నా ఈ అనుభవం గత కొన్ని యుగాలుగా
ఎలాంటి విరామం లేకుండా కొనసాగుతోందన్నారు.
తన పేరిట పలు కార్యక్రమాలు చేస్తున్న వారి గురించి ప్రస్తావిస్తూ
"నా కార్యక్రమం ఎవరు చేస్తుంటారో, అది వారి ఆధ్యాత్మిక ఉన్నతికి,
స్వలాభానికే వుపయోగపడుతుందన్నారు.
తెలుగు బాబా ప్రేమికుడైన డాక్టర్ ధనపతిరావ్ నాయుడు
తనతో సహవాస్‌కి తీసుకువచ్చిన వానిని బాబాకు పరిచయం చేస్తూ,
"ఈయన మా బంధువు" అని చెప్పాడు.
**ఈయన నా బంధువు అని అనరాదంటూ బాబా ఇలా అన్నారు.**
సహవాస్ అంటే ఏమిటో నీకు తెలుసా? అని ప్రశ్నించారు.
ప్రేమనిండిన హృదయంతో ఎవరైతో నా దర్శనార్థం వస్తారో
వారికి నా సహవాస్ లభిస్తుందన్నారు.
ఐతే, ఇదే నా ఆఖరు సహవాస్.
ఇకపై ఎలాంటి సహవాస్‌ల ఏర్పాటు వుండదు అని బాబా ప్రకటించారు.
నా ఈ భౌతికదేహ త్యాగం తర్వాత నేటి ఈ సహవాస్ గురించి చాలా విషయాలు
గ్రంథాలలో వ్రాస్తారు. కాబట్టి, భౌతికంగా నేను మీ మధ్యనే వున్న
ఈ అమూల్య అవకాశాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోండి.
"ఈ ప్రదేశం (మెహెరాబాద్) గొప్ప తీర్థయాత్ర స్థలం.
నేడు మీకు లభించిన ఈ అవకాశం చాలా ప్రత్యేకమైంది.
చాలా అరుదైనది కూడా. నేడు నేను మీకు ఇస్తున్న ఈ ఆలింగనం,

"భగవంతుడు స్వయంగా మానవునికి ఇచ్చిన అలింగనం".
ఈ సహవాస్ సృష్టించిన సంబంధమిది.
ప్రతిఒక్కరూ భగవంతుడిని సమీపిస్తున్నారు. ఇదొక అపూర్వ అవకాశం.
తిరిగి మీకిలాంటి అవకాశం లభించదు. మెహెరాబాద్ గొప్ప పవిత్రమైన స్థలం.
రాబోయే రోజుల్లో వేలాది యాత్రీకులు ఇక్కడకు వస్తారు. నేడు హాజరయిన
ఈ అపూర్వ సహవాస్‌లో పాల్గొన్న మీరెంత అదృష్టవంతులోనని
ఆనాడు వారందరూ మిమ్మల్ని గుర్తుచేసుకుంటారు. మీ దృష్టిని బాబాపై కేంద్రీకరించండి.
ఈ ఐదు రోజుల సహవాస్‌లో పాల్గొనేటప్పుడు మీ స్వవిషయాలంటిన్నీ మరచిపోయి,
బాబా ధ్యాసలోనే గడపండని" అన్నారు. బాబా దర్శనం కోసం క్యూలో వచ్చిన
రూసీ పాప్‌ని చూస్తూ " నేను చాలా సంవత్సరాల క్రితం క్వెట్టాలో వీరింట్లో వున్నానని
అన్నారు. బాబా మండలి సభ్యురాలైన డాక్టర్ గోహెర్ తండ్రి ఈయన.
అలాగే, రుస్తుం కాకాని ఉద్దేశించి, ఈతను "గొప్ప గాయకుడే కాదు,
నాకు గొప్ప ప్రేమికుడు కూడా" అన్నారు.
ఆ తర్వాత వచ్చిన రావ్ సాహెబ్ అఫ్‌సెరిని చూసి
ఆయన తనకు చాలా కాలంగా స్నేహితుడని అన్నారు.
నన్నెంతగానో ప్రేమించే వ్యక్తి రావ్ సాహెబ్ అని కొనియాడారు.
ఆ తర్వాత బాబా వివరంగా ఇలా అన్నారు. చాలా అరుదుగా,
అనేకమందిలో ఏ ఒక్కరో నా నిజరూపాన్ని దర్శించుకోగల్గుతారు.
ఇక్కడ మీలో చాలామందికి "నేను తప్పించి మిగిలినవన్నీ కనపడతాయి".
మీలో చాలామంది నన్ను చూస్తున్న అనుభూతి పొందుతున్నా,
మీరు చూస్తున్నది నన్ను కాదు.
నా నిజస్వరూపాన్ని కప్పివుంచిన ఒక తెరను మీరు చూస్తున్నారు.
ఐతే, మీరు ఆ తెరను దర్శించుకోవడం కూడా గొప్ప అదృష్టమే!!
ఆధ్యాత్మికంగా, అత్యంత ఉన్నతస్థాయిలో వున్నవారు పొందుతున్న అనుభూతిని
నా నిజదర్శనంతో పోల్చితే చాలా స్వల్పమే అవుతుంది.
గత రెండు రోజులుగా ఓ మస్తు మెహెరాజాద్‌లో వుంటున్నాడు.
ఈ సహవాస్ ప్రారంభమైన మొదటి వారంలో
నేను అతడ్ని చూసి, మెహెరాజాద్‌లోని ఒక గదిలో వుంచాను.
అతనికి తన దేహం గురించి ఏమాత్రం పట్టదు.
ఇక్కడ సహవాస్ కార్యక్రమం ముగిశాక సాయంత్రం మెహెరాజాద్‌లో
అతని గదికెళ్ళి చూస్తే, ఉదయం మేం వెళ్ళేటప్పుడు ఎలా కూర్చుని వున్నాడో
అలాగే ఎలాంటి మార్పు లేకుండా కూర్చుని వుంటాడు. రాత్రంతా కూడా ఆతను

అలాగే వుంటాడు. అతనికి ఆలోచించుకునే శక్తిని కోల్పోయాడా? అనేలా కనిపిస్తాడు.
ఆతను నా పాదాలచెంత ధూళిగా మారాడు. ఆతను నా నిజస్వరూపాన్ని
ఇంకా దర్శించుకోలేకపోయినా, నాకెంతో ఇష్టమైనవాడు.
భగవత్ దర్శనం పొందడమంటే ఆషామాషీ కాదు.
అదేమీ ఓ జోక్ కాదు. దేవుని దర్శనం కోసం ఓ తీయని మందు బిళ్ళ లేదు.
ఓ బిళ్ళ మింగితే దేవుని దర్శనం లభించే అవకాశం లేదు.
మొదటి వారంలో ఇక్కడ జరిగిన సహవాస్‌కి హాజరైన మీలో కొందరు,
మెహెరాజాద్‌లో ఆ మస్తుని చూసి వుంటారు. అతనేమీ పిచ్చివాడు కాదు.
చూడ్డానికి పిచ్చివాడులా కనపడొచ్చు. ఓ చిన్నపిల్లవాడిలాగా కూడా కనపడతాడు.
ఆతగాని మనస్సు ఏమాత్రం పనిచేయదు. అలాగని మనస్సు ఖాళీదీ కాదు.
అలాగని అతనొక పనికిమాలిన చవటాయనీ అనలేం.
ఓ పిచ్చివాడికంటే భిన్నమైన వాడతను. భగవంతుని ఎడల గల అపారమైన
ప్రేమ వల్ల వారలా కనపడతారు. దేవుని కోసం నిరీక్షణలో ఆతను అలా
దేవుని పాదాలచెంత ధూళిగా మారిపోతాడు. ఆతను ఈ సమాజంలోనే బ్రతుకుతున్నా,
ఆతనికి ఆతని చుట్టుప్రక్కల వున్నదేమీ పట్టదు.
నేను మీరందరూ కూడా ఆతనిలా అయిపోవాలని అనడం లేదు.
ఐతే ఆతనికి నాపై (భగవంతుడు) గల ప్రేమ కలిగి వుండాలని నేను కోరుతున్నాను.
అతనికి నా ఎడల వున్న అమితమైన ప్రేమ, మీకూ వుండాలని కోరుతున్నాను.
మీ సాధారణ జీవితాలను ఎప్పటిలాగా గడుపుతూనే
భగవంతుడ్ని అధికంగా, ఇంకనూ అధికంగా ప్రేమించండి.
అదే నిజమైన జీవితం!! !!! అని బాబా అన్నారు.
నాకు సాధువులు – పాపాలు చేసివాడు, సమాజంలో ఉన్నతస్థాయిలో వున్నవారు –
తక్కువ స్థితిగతులలోనివారు, అత్యంత ధనికుడు –కడు నిరుపేద, మగవారు – ఆడవారు,
యువకులు – ముసలివారు, ఇలా అందరూ ఒక్కటే.
ఎలాంటి తారతమ్యాలు నాకు లేవు. ఎందుకు? ఎందుకంటే, నేను అందరిలో వున్నాను.
నన్ను కల్సుకోవడానికి, నన్ను ఆలింగనం చేసుకోవడానికి
ఎవరూ వెనుకాడరు! అని బాబా అన్నారు.

–సశేషం

## మెహెర్‌బాబా పత్రిక ఆన్‌లైన్‌లో
## www.srimeherbaba.com సందర్శించండి!!

# బాబాలో ఐక్యమయ్యారు.

## యు.బాపిరాజు



ఏలూరు బాబా కేంద్ర కార్యదర్శి శ్రీ యు. బాపిరాజు జూలై 21న బాబాలో ఐక్యమయ్యారు. నిరంతరం అవతారుని నామస్మరణలో గడిపే బాపిరాజు గారు స్వల్ప అస్వస్థతకు గురై స్థానిక ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారని బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. అవతారుని సందేశాలను అనర్గళంగా ప్రసంగించే బాపిరాజు గారి లేనిలోటు తీరనిదని పలువురు బాబా ప్రేమికులు తమ సంతాప సందేశాన్ని వారి కుటుంబసభ్యులకు తెలియజేశారు. బాబా సాహిత్యాన్ని క్షుణ్ణంగా ఆకళింపుచేసుకున్న ప్రేమికునిగా, తమకు అత్యంత ప్రీతిపాత్రమైన మిత్రుడ్ని భౌతికంగా కోల్పోయామని ఆయన సన్నిహితులు అన్నారు.

## శ్రీమతి తవ్వా



గుంటూరు బాబా కేంద్ర ప్రేమికులు శ్రీ తవ్వా హరగోపాల్ గారి భార్య శ్రీమతి అనూరాధ 2020 జూలై 20న స్వల్ప అస్వస్థతతో అవతారుని నామస్మరణతో బాబాలో ఐక్యమయ్యారని, స్థానిక కేంద్ర నిర్వాహకులు శ్రీ బి.డి. నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనెడిదని, ఆమె ఎక్కువగా బాబా నామస్మరణలో గడిపిన ధన్యజీవి అని శ్రీ నరసింహారావు అన్నారు.

## శ్రీ కామారపు శ్రీనివాసరావు

శ్రీ కామారపు శ్రీనివాసరావు, కరీంనగర్ ఆగస్టు 6న బాబాలో ఐక్యమయ్యారని స్థానిక సాయినగర్ కేంద్ర కార్యదర్శి శ్రీ యన్ లక్ష్మీనరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసరావు బాబాకేంద్రం స్థాపించినప్పటి నుండీ తమకెంతో చేదోడువాదోడుగా వున్నారని ఆయన అన్నారు. వారి ఆత్మకు శాంతికలగాలని ప్రార్థించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

---

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

## మా అడ్రస్:

ఎడిటర్, మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్,
బాబాస్ హౌస్,
యాప్రాల్, ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218.
**email: malladisukku@gmail.com**

---

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 **Dt.20-01-2020,** Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.